

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), జూలై 14: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 15వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని వారు జిల్లా కేంద్రానికి రావాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు.

# నాడు గొప్పలు.. నేడు తిప్పలు..

- ఆర్భాటపు ప్రకటనలు.. ఆచరణలో అలసత్వం
- నిలిచిపోయిన నాడు-నేడు పనులు
- విద్యార్థులకు తప్పని ఇక్కట్లు



రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇరుకు గదుల్లో కూర్చున్న విద్యార్థులు

సుండుపల్లె, జూలై 14: పాఠశాలల రూపురేఖలే మార్చేస్తాము. కార్పొరేట్‌ను తలదన్నేలా వ్యవస్థ ఉంటుందని గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. తీరా ఆచరణలోకి వచ్చేసరికి భావితరాలకు అవస్థలు మిగిల్చింది. వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పేరిట చేపట్టిన కార్యక్రమం విద్యాలయాల దశను మార్చలేదు సరికదా సరికొత్త తలనొప్పులు తెచ్చిపెట్టింది. రెండో దశ పనులు ఎక్కడికక్కడ అసంపూర్తిగా నిలిచిపోయాయి. కొన్ని పునాదుల్లోనూ, మరికొన్ని గోడల రూపంలో దర్శనమిస్తున్నాయి. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దుతామని గత పాలకులు ఆర్భాటంగా ప్రకటనలు చేసి ఆచరణలో చతికిలపడ్డారు. సుండుపల్లె మండలంలో 22 పాఠశాలలు నాడు-నేడుకు ఎంపికయ్యాయి. 70 శాతానికిపైగా బడుల్లో పనులు పూర్తి కాలేదు. గదులు పూర్తయినచోట ఫ్లోరింగ్ చేయలేదు. ఫ్లోరింగ్ చేస్తే ప్లాస్టింగ్ పూర్తి చేయలేదు. చాలా పాఠశాలలకు ద్వారాలు, కిటికీలే లేవు. మరికొన్ని వాటికి అసలు ఫ్లోరింగే చేయలేదు. రంగులు వేయలేదు. కొన్ని పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం లేదు. తాగేందుకు నీరూ లేదు. ప్రభుత్వ బడులను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతాం. ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ బోధన, సీబీఎస్ఈ సిలబస్, టోఫెల్ పరీక్ష ఇలా ఏదో చేసేస్తున్నామన్నట్లుగా గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటనలు చేయడం మినహా పాఠశాలల్లో ఆ స్థాయి పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. నాడు-నేడు పథకంలో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన చేపడుతున్నామన్న గత పాలకులకు ఆ పనులు పూర్తి చేయడానికి నిధులు విడుదల చేయని పరిస్థితి కారణంగా మామయ్య మిగిల్చిన విద్య అవస్థలు విద్యార్థులను వెంటాడుతున్నాయి.

### నిధుల కొరతతో..

సుండుపల్లె మండలంలో నాడు-నేడు రెండో విడతలో మొత్తం 22 పాఠశాలలు ఎంపిక చేసి పనులు చేసేందుకు అనుమతులిచ్చారు. ఈ ఏడాది పాఠశాలలు తెరిచే నాటికి తరగతి గదులు మరమ్మతులు చేయాల్సి ఉన్నా ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మరో పక్క జీవో 117 ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ఈ క్రమంలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో 3 నుంచి 10వ తరగతి వరకు తరగతులు నిర్వహించడం కష్టమవుతోంది. రాయవరం, తిమ్మసముద్రం, జి.రెడ్డివారిపల్లె, మడితాడు, ఉర్దూ, పింఛా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అదనపు గదులు నిర్మించాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వలన సగంసగం పనులకే పరిమితమయ్యాయి. అలాగే రాయవరం ఉర్దూ అదనపు తరగతి గదుల నిర్మాణం చేయాల్సి ఉంది. అదనపు గదుల పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో విద్యార్థులు నానా అగచాట్లు పడుతున్నారు. గత ఏడాది చేపట్టిన పనుల్లో కొన్ని నేటికీ 60 శాతం పనులు దాటలేదు. సుండుపల్లె మండల వ్యాప్తంగా రూ.659 కోట్లతో నాడు-నేడు పనులు ప్రారంభించగా కనీసం సగం నిధులు కూడా విడుదల చేయకుండా వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి విమర్శలు వస్తున్నాయి.

### క్షేత్రస్థాయిలో పర్యవేక్షణా లోపం..

క్షేత్రస్థాయిలో విద్యాశాఖాధికారుల పర్యవేక్షణాలోపం పుష్కలంగా ఉంది. ప్రతి పాఠశాలలో నాడు-నేడు నిధులు డ్రా చేసి పనులు చేయాలంటే పేరెంట్స్ కమిటీ నుంచి నలుగురు, పేరెంట్ కమిటీ ఛైర్మన్, ప్రధానోపాధ్యాయుడు, జేఈ, డీఈ ఇతర అధికారులను కమిటీలో భాగస్వాములను చేశారు. అయితే ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుని నిధులు రావడం లేదని ప్రభుత్వానికి పర్యవేక్షణా లోపాన్ని తెలియజేయాల్సిన వారు కనీసం సమస్య బయటికి రాకుండా చేశారని విమర్శలు ఉన్నాయి. అంతేగాక మండల స్థాయి, జిల్లా స్థాయి విద్యాశాఖాధికారులు నాడు-నేడు పనుల పరిశీలనలో తీవ్రంగా విఫలం కావడంతో పాటు వైసీపీ ప్రభుత్వంపై స్వామి భక్తి ప్రదర్శించారనే విమర్శలు కూడా సుండుపల్లె మండలంలో ఉన్నాయి. విద్యావ్యవస్థ ఈ స్థాయిలో ఉండడానికి విద్యార్థినీ, విద్యార్థులు అవస్థలు పడడానికి ప్రభుత్వ నిర్లక్ష్యం, నిధులు విడుదల చేయకపోవడంతో పాటు పర్యవేక్షణ లోపం ప్రధాన కారణమని విమర్శలు ఉన్నాయి.



అర్థంతరంగా ఆగిన జి.రెడ్డివారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు భవన నిర్మాణాలు

#### విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం..



గత ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడం, నిపుణులతో గానీ, ఉపాధ్యాయ సంఘాలతో గానీ చర్చించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వలన విద్యావ్యవస్థ అస్తవ్యస్తమైంది. కొన్ని కోట్లు ఖర్చు పెట్టి నాడు-నేడు పనులు ప్రారంభించారు. ప్రారంభించి ఏడాది గడవకముందే మూడు, నాలుగు, ఐదు తరగతులను విలీనం చేసి డబ్బు వృథా చేశారు. ఏపీలో కూటమి అధికారంలో ఉంది. క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన, అసంపూర్ణమైన భవనాలు పూర్తి చేసి విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అవసరం ఉంది. విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాలి.

\- కత్తి నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ

#### తాగడానికి నీళ్లు లేవు..



అన్నం తింటే తాగడానికి నీళ్లు లేవు. నాలుగు, ఐదు రోజులు నిలువ చేసిన నీరు తాగాల్సి వస్తోంది. ఇంటి వద్ద నుంచి ఒక లీటరు నీళ్లు తెచ్చుకుంటే మధ్యాహ్నం అన్నం తినే సమయానికి అయిపోతోంది. చదువుకునేందుకు తరగతి గదుల్లో వసతులు సైతం సరిగ్గా లేవు. తాగునీటిని అందించి పుణ్యం కట్టుకోండి.

\- పవన్‌కుమార్, 10వ తరగతి, జి.రెడ్డివారిపల్లె

#### నిధులు రాక పనులు సాగక..



గత ప్రభుత్వంలో నిధులు సక్రమంగా సకాలంలో అందించకపోవడం వలన మండలంలో నాడు-నేడు పనులు పూర్తి కాలేదు. సగం కూడా నిధులు విడుదల చేయకపోవడం విద్యా వ్యవస్థకు శాపంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విద్యావ్యవస్థలో ఉన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలి.

\- నాగరాజునాయక్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు

#### చదువుకునేందుకు వీలులేదు..



గదుల కొరత వలన చదువుకునేందుకు వీలులేదు. ఒకే గదిలో ఎక్కువ మంది విద్యార్థులు కూర్చుని చదువుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఉపాధ్యాయులు క్లాసులు చెప్పేటప్పుడు వినేందుకు కూడా వీలే లేదు. తరగతుల్లో చదువుకునేటప్పుడు రీసౌండ్ వస్తోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

\- ఇబ్రహీం, 9వ తరగతి, తిమ్మసముద్రం ఉర్దూ స్కూల్




ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో సాధించిన బహుమతులతో బాలుడు సూరే కుశాంకు కుమార్‌రెడ్డి

# బుడ్డోడు మహా గట్టోడు..

- సిద్దవరం బాలుడికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

పెనగలూరు, జూలై 14: మండలంలోని ఎగువ సిద్దవరం గ్రామానికి చెందిన సూరే కుశాంకు కుమార్‌రెడ్డి (2) బాలుడికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించిందని బాలుడి తల్లిదండ్రులు సూరే శివకుమార్, సౌమ్య దంపతులు తెలిపారు. బాలుడి తల్లిదండ్రుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాలుడు మంచి జ్ఞాపకశక్తి కలిగి ఉండడంతో అతనికి అన్ని రకాల పరీక్షలు చేసినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఇంగ్లీష్ నెలలు, వారాలు, ఏబీసీడీలు, రైమ్స్, శరీర భాగాలు, జంతువుల పేర్లు, ఒకటి రెండు మూడు అంకెలు, సంఖ్యలు, పువ్వులను గుర్తించడం, శ్రీరామ రామ రామేతి శ్లోకం చెప్పడం, యాక్షన్ పదాలు ఇవన్నీ బాగా గుర్తు పెట్టుకుని ఎక్కడ అడిగితే అక్కడ అవలీలగా చెబుతుండటంతో తాము బాలుడి నడవడికలు, జ్ఞాపకశక్తి అన్నింటిని వీడియో చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు పంపించామని తెలిపారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారులు అవన్నీ పరిశీలించిన తర్వాత తమ బాలుడికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కుతున్నట్లు తెలిపారు. అనంతరం బాలుడి ఫొటోను ఆన్‌లైన్‌లో వారికి పంపించామని తెలిపారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ యాజమాన్యం బాలుడికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం ఇచ్చినట్లు ఆన్‌లైన్‌లో రికార్డు చేసినట్లు తెలిపారు. అలాగే సర్టిఫికెట్, మెమెంటో, మెడల్స్‌లను కూడా బాలుడికి పంపించినట్లు తెలిపారు. దీంతో వారి కుటుంబ సభ్యులు ఆనందంగా ఉన్నారు.



తల్లిదండ్రులతో చిన్నారి

# బస్సు - లారీ ఢీ



- ఒకరు మృతి.. 20 మందికి గాయాలు

నందలూరు, జూలై 14 : కడప-చెన్నై జాతీయ రహదారిలో నందలూరు ఆల్విన్ కర్మాగారం సమీపంలో తిరుపతి నుంచి జమ్మలమడుగు వెళుతున్న ఏపీ 39 యూడబ్ల్యూ 3222 ఆర్టీసీ బస్సును కడప నుంచి చెన్నైకి వెళుతున్న ఏపీ 39యూవీ 0342 లారీ ఢీకొనడంతో బస్సు కండక్టర్ తారకరాముడు (40) అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ మల్లేల ధనంజయ్య లారీలో, బస్సు డ్రైవర్ రాజు బస్సులో ఇరుక్కుపోయారు. బస్సులో ఉన్న ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా మరో 14 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని కడప, రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. ఇరుక్కుపోయిన లారీ, బస్సు డ్రైవర్లను కాపాడేందుకు పోలీసులు, స్థానికులు జేసీబీల సహాయంతో విశ్వ ప్రయత్నం చేసి ఎట్టకేలకు ఇద్దరిని కాపాడి కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. ప్రమాదం జరిగిన సంఘటన స్థలానికి స్థానిక ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. కడప-చెన్నై రహదారిలో 2 గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు, స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది గాయపడినవారిని చికిత్స నిమిత్తం రాజంపేట, కడప ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు.



మృతి చెందిన కండక్టర్ తారకరాముడు

# దేవతలారా.. రండి

- వైభవంగా ధ్వజారోహణం
- యాలి వాహనంపై దర్శనమిచ్చిన సౌమ్యనాథుడు




ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న పండితులు

నందలూరు, జూలై 14: జిల్లాలో ప్రముఖ వైష్ణవ క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చక స్వాములు సునీల్‌కుమార్ బృందం ఆధ్వర్యంలో ధ్వజస్తంభంపై గరుడ చిహ్నంతో ఉండే పతాకాన్ని ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ధ్వజారోహణం బ్రహ్మోత్సవాలకు సూచిక, సకల దేవతలకు ఆహ్వానం పలికే ధ్వజారోహణంలో మహావిష్ణువుకు గరుత్మంతుడు ప్రియ వాహనం. కావున ఆ గరుడ నిలువెత్తు రూపం 20 మీటర్ల నూతన వస్త్రంపై పసుపు, కుంకుమ, తైలంతో చిత్రీకరించారు. ఈ నూతన వస్త్రం ధ్వజస్తంభంపై ఎగురవేస్తే సకల దేవతలు బ్రహ్మోత్సవాలను తిలకిస్తారని ప్రతీతి. వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య గరుడ ధ్వజపీఠాన్ని ధ్వజస్తంభాగ్రహణమునకు లాగారు. దీంతో ధ్వజారోహణం పూర్తయ్యింది. రాత్రి యాలి వాహనంపై మహా తేజోవంతుడు సౌమ్యనాథుడు శ్రీదేవి భూదేవితో కలిసి విశేష అలంకరణలో పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

### బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు సోమవారం ఉదయం పల్లకిసేవ, గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రికి హంస వాహనంపై సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, టీటీడీ సూపరింటెండెంట్ హనుమంతు తెలిపారు.



యాలి వాహనంపై సౌమ్యనాథస్వామి

# హాకీ పోటీల్లో సత్తా చాటుతున్న ఆంధ్ర ఆటగాళ్లు

- మెన్, ఉమెన్ విభాగంలో విజేతలుగా నిలుస్తున్న జట్లు




పులివెందుల రూరల్, జూలై 14: పులివెందులలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న 2వ సౌత్‌జోన్ జూనియర్ చాంపియన్‌షిప్-2024 హాకీ పోటీలలో ఆంధ్రప్రదేశ్ ఉమెన్, మెన్ జట్లు సత్తాచాటుతున్నాయి. 11వ తేదీ గురువారం నుంచి జరిగిన పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్లు అత్యుత్తమ ఆట తీరును ప్రదర్శించి విజేతలుగా నిలి చాయి. ఆదివారం జరిగిన పోటీలలో సైతం తమ సత్తా చాటాయి. ఉమెన్స్ విభాగంలో తమిళనాడు-పాడిచ్చేరి మధ్య జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు 15 గోల్స్ చేసి విజయం సాధించింది. కేరళ-తెలంగాణ మధ్య మ్యాచ్‌లో 5 గోల్స్ చేసి కేరళ, ఆంధ్రప్రదేశ్-కర్ణాటక మధ్య జరిగిన మ్యాచ్‌లో 3 గోల్స్ చేసి ఆంధ్రప్రదేశ్ జట్లు విజయం సాధించాయి. మెన్స్ విభాగంలో కర్ణాటక-తమిళనాడు మధ్య జరిగిన మ్యాచ్‌లో 4 గోల్స్ చేసిన కర్ణాటక, కేరళ-పాండిచ్చేరి మధ్య జరిగిన మ్యాచ్‌లో 9 గోల్స్ చేసిన కేరళ, ఆంధ్రప్రదేశ్-తెలంగాణ మధ్య జరిగిన మ్యాచ్‌లో 2 గోల్స్ చేసిన ఆంధ్రప్రదేశ్ జట్లు విజయం సాధించాయని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బీఎం చాణిక్యరాజ్ తెలిపారు.

# నీలం ధరలు అదుర్స్

- టన్ను మామిడి రూ.65 వేలు.. ఇంకా పెరిగే అవకాశం
- అరకొరగా కాయలు, ఇతర రాష్ట్రాల్లో డిమాండ్
- రెండు మూడు రోజుల్లో ముగియనున్న సీజన్



కోడూరు మార్కెట్ యార్డులో రాసిపోసిన కాయలు

నీలం రకం మామిడి కాయల ధరలు భారీగా పెరిగాయి. ప్రస్తుతం టన్ను రూ.65 వేలు పలుకుతున్నాయి. ఇంకా ధరలు పెరిగే అవకాశం ఉంది. ఈ రకానికి ఇతర రాష్ట్రాల్లో విపరీతంగా డిమాండ్ ఉంటుంది. అయితే కాయలు మాత్రం అరకొరగా యార్డుకు వస్తున్నాయి. రెండు మూడు రోజుల్లో మామిడి సీజన్ ముగియనుంది. సీజన్‌లో ఆఖరిగా వచ్చేది నీలం రకం మామిడి కాయలు. ఎక్కువ రోజులు కాయలు నిల్వ ఉండడంతో సీజన్ ఆఖరిలో ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. దీంతో పాటు ధరలు కూడా ఎక్కువగా ఉంటాయి. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు నీలం కాయలను వ్యాపారులు ఎగుమతి చేస్తారు.

రైల్వేకోడూరు, జూలై 14: ఈ ఏడాది మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సీజన్ మొదట్లో అరకొరగా కాయలు ఉన్నా రేట్లు లేక రైతులు నష్టాల పాలయ్యారు. సీజన్ చివరలో వచ్చే నీలం రకానికి ప్రస్తుతం మంచి రేటు ఉన్నా కాయలు సరిగ్గా లేవు. కాయలు ఉన్న రైతులు మాత్రం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా 25 శాతం నుంచి 30 శాతం వరకు తగ్గకుండా దిగుబడులు వచ్చేవి. అయితే ఈ ఏడాది 6 శాతంకు మించి దిగుబడులు రాలేదు. దీంతో ఎప్పుడూ కళకళలాడే మార్కెట్ యార్డు ఈ ఏడాది వెలవెలబోయింది. ప్రతి ఏటా 2 వేల మంది కూలీలు గుంతకల్లు, తాడిపత్రి, కర్నూలు, ఆళ్లగడ్డ, కడప, అనంతపురం, పత్తికొండ తదితర ప్రాంతాల నుంచి వచ్చి కూలీ పనులు చేసుకునే వారు. కాయలు లేకపోవడంతో పనులు కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. ప్రతిరోజూ 50 లారీలకు పైగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యే మామిడి కాయలు 5 లారీల్లో కూడా పంపే పరిస్థితి లేదు. బేనీషా, ఖాదర్, మల్లికా, తోతాపూరి, కాలేపాడు, పులిహోరా, మాల్గోవా, రుమాణి తదితర రకాల కాయలు దిగుబడులు వచ్చి ఉంటే భారీగా మార్కెట్ యార్డుకు రైతులు తరలించేవారు. అయితే దిగుబడులు లేకపోవడంతో అరకొరగా యార్డుకు రైతులు ఈ ఏడాది తరలించారు.

మామిడి తోటలకు కూలీలు, దున్నకాలు, ఎరువులు, పురుగు మందులు తదితర వాటికి రైతులు భారీగా ఖర్చు చేశారు. పెట్టిన ఖర్చులు కూడా రాలేదని చాలా మంది రైతులు వాపోతున్నారు. కొన్ని తోటల్లో మాత్రమే కాయలు బాగా దిగుబడి వచ్చినా కాయలకు మంగు పడింది. దీంతో మార్కెట్‌లో పచ్చడికి తప్ప పండుగా తినడానికి పనికి రాకుండా పోయింది. మామిడి దిగుబడులు తగ్గిపోవడంతో వ్యాపారం కూడా కుప్పకూలింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నీలం మామిడిని ఇతర రాష్ట్రాలకు 2 నుంచి 3 లారీల్లో ఎగుమతి చేస్తున్నారు. డిమాండు ఉన్నా కాయలు అరకొరగా ఉండడంతో వ్యాపారులు సకాలంలో ఇతర రాష్ట్రాల మార్కెట్‌కు పంపలేకపోతున్నారు. ఒక్క లారీ కాయలను లోడింగ్ చేసుకోవడానికి రెండు రోజుల సమయం పడుతోంది. గతంలో గంటకు ఒక్క లోడు కాయలను కూలీలు వేసే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదని వ్యాపారులు అంటున్నారు. కోడూరులో మామిడి పంట లేదని జగిత్యాల, వరంగల్, కరీంనగర్ తదితర ప్రాంతాలకు ఇక్కడి వ్యాపారులు వెళ్లి మామిడికాయలు కొనుగోళ్లు చేయడం కొసమెరుపు.



కాయలను ప్యాకింగ్ చేస్తున్న కూలీలు



కాయలు లోడింగ్ కాక నిలిచిపోయిన లారీ

#### అనుకున్నంత వ్యాపారం లేదు..



ఈ ఏడాది మామిడి వ్యాపారం అనుకున్నంత లేదు. దిగుబడులు లేక వ్యాపారం చేయలేకపోయాము. ఇటు రైతులు, అటు వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. రైతులకు పెట్టుబడులు ఇచ్చాము. కాయలు లేక అటు వ్యాపారం సాగక ఇబ్బందులకు గురయ్యాం. కాయలు లేని వ్యాపారాన్ని ఎప్పుడూ చూడలేదు. కిటకిటలాడే మార్కెట్ యార్డు వ్యాపారం మొదలైనప్పటి నుంచి వెలవెలబోయింది. కాయల దిగుబడి లేక పోవడంతో ఈ ఏడాది నష్టాలను చవిచూడాల్సి వచ్చింది.

\- సింగిరి నరసింహులు, గుండాలపల్లె, మామిడి వ్యాపారి

#### వాతావరణ పరిస్థితులే కొంపముంచాయి..



ఈ ఏడాది వాతావరణ పరిస్థితులే మామిడి రైతుల కొంప ముంచాయి. పలుసార్లు పూత సమయంలో వర్షాలు కురవడంతో వచ్చిన పూత దెబ్బతింది. అరకొరగా కాపు వచ్చినా.. ఉన్న కాయల్లో మంగు ఏర్పడింది. ఈ కాయలను పచ్చళ్లకు అమ్ముకోవాల్సి వచ్చింది. పలు రకాల పండ్లకు పురుగులు పట్టాయి. అరకొరగా వచ్చిన కాయలను మార్కెట్ యార్డుకు తరలించాము. పెట్టిన పెట్టుబడులు కూడా రైతులకు రాలేదు.

\- గంపల సుబ్బయ్య, మామిడి రైతు, మారావారిపల్లె

## పాముతో పచారాలు - గుర్తించాక పరుగులు



వాహనం హ్యాండిల్‌కు చుట్టుకుని ఉన్న పాము

చెన్నూరు, జూలై 14: తాను నడిపే ద్విచక్ర వాహనం హ్యాండిల్‌కు చుట్టుకున్న పామును గమనించక దానితోనే ఊరంతా పచారాలు చేశాడు. కాలుకు తగిలింది పామని గుర్తించాక పరుగులు అందుకున్నారు. నరసారెడ్డిపల్లెకు చెందిన జయరామిరెడ్డి వ్యవసాయ పనులు చేసుకునేవాడు. తన టీవీఎస్ మోపెడ్ ఇంటి ముందు ఉంచి ఇంటికి వెళ్లి తిరిగి పెట్రోలు పట్టించుకునేందుకు బండిలో చెన్నూరుకు వచ్చాడు. అప్పటికే వాహనం హ్యాండిల్ హెడ్‌లైటు మధ్య ఓ పాము చుట్టుకుని ఉంది. ఈ విషయం అతను గమనించలేదు. చెన్నూరుకు వచ్చి చెన్నూరులో పెట్రోలు పట్టుకుని అదే వాహనంలో చెన్నూరు పాతబస్టాండుకు వస్తుండగా అప్పటి వరకు చుట్టుకున్న పాము కాసింత కదిలి ఆయన కాళ్ల కిందకు చేరింది. కాలికి మెత్తగా తగలడంతో ఏమిటని చూసి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. అప్పటి వరకు ఆ పామును గమనించని జయరామిరెడ్డి దాన్ని చూడగానే ఒక్కసారిగా మైండ్ బ్లాక్ అయి భయపడి వాహనాన్ని రోడ్డుపైనే వదిలేసి పరిగెత్తాడు. ఈ విషయాన్ని దారిన పోయేవారు గమనించి దాన్ని చూసి ఆశ్చర్యపోయారు. ఇంత సేపూ వాహనానికి చుట్టుకున్న పాము మీకు కనిపించలేదా అంటూ అడిగి తరువాత కర్రలతో పామును కొట్టి చంపివేశారు.

# అప్పులు మిగిల్చిన మామిడి



సింగనమల వద్ద కాపులేక ఉన్న పునాస రకం మామిడి తోట

### కాయలు కాయక.. ధరలు లేక... కుప్పకూలిన రైతన్న

పెనగలూరు, జూలై 14: మండలంలో రైతులకు ప్రధాన ఆదాయ వనరు పంట మామిడి ఈ ఏడాది రైతులకు అప్పులు మిగిల్చాయి. కాగా మండలంలో ఉన్న కమీషన్ ఏజెంట్ల వ్యాపారం కూడా అంతంత మాత్రంగానే మిగిలిపోయింది. ఇక వ్యాపారులు ధైర్యం చేసి ముందుగా పంటపై పెట్టుబడులు పెట్టలేకపోయారు. అంతకంటే ముందు తోటలపై దిగుబడి కోసం భారీగా పెట్టుబడులు పెట్టిన రైతన్నలు కుప్పకూలి పోయారు. ఈ ఏడాది మండలంలో దాదాపు 95 శాతం మామిడి తోటలు దిగుబడి ఇవ్వలేకపోయాయి. మామిడి కాపును నమ్ముకుని వ్యవసాయం చేస్తున్న రైతులు పంట దిగుబడి బాగా రావాలని అప్పు తెచ్చి బాగా మందులను పిచికారీ చేశారు. ఒక దఫా పిచికారీ చేసినప్పుడు పూత రాకుంటే మళ్లీ పిచికారీ చేస్తూ వచ్చారు. దానిలో కూడా రాక పోతే మూడో దఫా కూడా మందులను పిచికారీ చేసి నిట్టూర్పుగా నిస్సహాయ స్థితిలో నిలిచిపోయారు. ఎకరాకు వెయ్యి రూపాయల చొప్పున కనీసం ఐదెకరాల తోటకు ఐదు వేల రూపాయలు క్రిమి సంహారక నివారణ చర్యల కోసం మందులు వాడిన రైతులు మూడు దఫాలు రూ.15 వేలను ఖర్చు పెట్టాల్సి వచ్చింది. సస్యరక్షణ కోసం ట్రాక్టర్‌తో దుక్కి, దున్నకాలు, చెట్లు పాదులు కలిపి మరో రూ.5 వేలు ఖర్చు వచ్చింది. ఈ విధంగా ఏడాదికి రూ.30 వేలు పైబడిన ఖర్చు రైతులకు భారంగా మారింది. ఎన్ని చేసినా పెట్టిన పెట్టుబడిలో కనీసం పది శాతమైనా కాయలు కాయక రైతు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దిగుబడి కోసం వ్యయ ప్రయాసల కోర్చి రైతులు మామిడి సాగుపై పెట్టుకున్న ఆశలు పూర్తిగా నిరాశ్రయులయ్యారు. ఇక మామిడి సాగు పై ఆసక్తి సన్నగిల్లుతోంది. ప్రకృతి వైపరీత్యాలు కారణమా, అధిక మోతాదులో మందులు పిచికారీ ప్రభావమా అని రైతులు సందిగ్ధంలో పడిపోయారు. అయితే రైతులకు పంట దిగుబడులపై పూర్తిగా ఉద్యానశాఖ అధికారులు అవగాహన కల్పించకపోవడం దారుణం. ఇదిలా ఉండగా ప్రధాన కాపు తర్వాత అన్‌సీజన్‌లో వచ్చే ఉమ్మకాపు కూడా ఈ ఏడాది కాయ కపోవడం చాలా బాధాకరమని రైతన్నలు లబోదిబోమంటున్నారు. ప్రధాన కాపు ముగిసిన తర్వాత నీలం మామిడి చెట్లలో కనీసం 20 శాతం నుంచి 50 శాతం వరకు కాయలు దిగుబడి వచ్చేవి. ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాలు, మందుల పిచికారీ ప్రభావంతో ఆ ఆశ కూడా రైతులకు లేకుండా పోయింది. మండలంలో దాదాపు 8 వేల ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. అయితే ఒక్కశాతం కూడా నీలం కాపు కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని రైతన్నలు అంటున్నారు. ఇదిలా ఉండగా మామిడి పునాస రకంలో ఏడాదికి రెండుసార్లు తప్పనిసరిగా కాపుని స్తాయి. ఆ పునారస రకం చెట్లలో కూడా కాయలు కనిపించకపోవడం ఆశ్చర్యానికి తావిస్తుందంటున్నారు. మే నెల నుంచి పూత, పిందెలతో ప్రారంభమ య్యే పునాస కాపు ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాల కారణంగా పూత పూర్తిగా మగ్గిపోగా కాపు కనిపించకుండా పోయింది. అందువల్ల పునారస సాగు చేసిన రైతన్నలు ఈ ఏడాది కనీసం పొలం ఖర్చులకన్నా ఆదాయం లభిస్తుందని అనుకున్నా అది కూడా నిరాశగానే మిగిలిపోయింది. ఇక ఈ ఏడాదికి మామిడి రైతన్నలకు పూర్తిగా నష్టం మిగిలిపోయింది. ఇదిలా ఉండగా మండలంలోని కొన్ని ప్రాంతాల్లో మామిడి సాగుపై ఆసక్తి సన్నగిల్లి తోటలను నరికేసే పరిస్థితి ఏర్పడింది. రానున్న రోజుల్లో మామిడి సాగు పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారు కానుందని రైతులు నిట్టూర్పుతున్నారు. ఏదేమైనా పంటను నమ్ముకుని లక్షలు, కోట్ల రూపాయలు ఖర్చు పెట్టిన రైతులు, వ్యాపారులు బాగా దిగాలు తీసిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా ప్రభుత్వం వ్యవసాయాన్ని, ఉపాధి పథకాన్ని అనుసంధానం చేసి రైతులను కొంతవరకైనా ఆదుకోవాలని కోరుతున్నారు.



#### ఆదాయం పూర్తిగా ఆగిపోయింది



రెండేళ్ల నుంచి రైతుల దగ్గర మామిడికాయలు కొనుగోలు చేసి కమీషన్ ఏజెంట్‌గా వ్యాపారులకు కాయలు సరఫరా చేశాను. రెండేళ్లు ఏడాదికి సరఫరా ఖర్చులు లభించాయి. ఈ ఏడాది కూడా అదే ఆశతో కమీషన్ వ్యాపారం ప్రారంభించాను. అయితే కాయల కోసం ఎంత కష్టపడినా ఆశించిన మేర మండీకి కాయలు రాలేదు. ఫలితంగా బాగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండేళ్లలో ఏడాదికి కనీసం 200 టన్నులైనా వ్యాపారులకు సరఫరా చేసేవాడిని. ఈ ఏడాది ఆ ఆశ లేకుండా పోయింది. అతి కష్టం మీద 20 టన్నులు కూడా పంపించలేని పరిస్థితి ఏర్పడింది. ఇలా జరుగు తుందని ఎప్పుడూ అనుకోలేదు. ముందు రోజుల్లో ఇలాగే ఉంటే కమీషన్ వ్యాపారం చేసుకునేందుకూ అవకాశం ఉండదు.

\- పుచ్చకాయల రవిశంకర్,
కమీషన్ ఏజెంట్, ఈటమాపురం


## మానసిక వ్యాధుల పట్ల 200 మందికి అవగాహన



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సూపరింటెండెంట్ తదితరులు

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 14: కడప ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి పరిధి మెంటల్ కేర్ ఆస్పత్రిలో ఆదివారం రాయలసీమ జోన్ మానసిక వ్యాధుల పీజీసీఎంఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దాదాపు 200 మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఇందులో సైక్రియాటిక్ పీజీలు 50 మంది సైకియాటిక్ డాక్టరు 40 మంది మిగిలిన వారు జనరల్ వైద్యులు పాల్గొన్నారు. శారీరక వ్యాధుల పట్ల మానసిక సమస్యలకు సంబంధించి నిర్వహించారు. చర్మవ్యాధులు, గుండె, క్యాన్సర్ వ్యాధులు దీర్ఘకాలిక వ్యాధులతో వచ్చే మానసిక సమస్యలపై సీనియర్ ప్రొఫెసర్లు ఈ అవగాహనలో అభిప్రాయాలు పంచుకున్నారు. కార్యక్రమానికి ప్రారంభోత్సవ అతిథిగా రిమ్స్ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, నోడల్ ఆఫీసరుగా కర్నూలు డాక్టర్ నాగేశ్వర్‌రావు వ్యవహరించారు. కార్యక్రమంలో సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ సురేశ్వర్‌రెడ్డి, పులివెందుల ప్రొఫెసరు డాక్టర్ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు. రాయలసీమ జోన్ ప్రభుత్వ ప్రైవేటు కళాశాల సైకియాట్రిక్ పీజీలు ఐఎంహెచ్ డాక్టర్లు, పీజీలు, మెంటల్ కేర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకట్రాముడు వైద్యులు, పీజీలు, వైద్యేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సమావేశం కడపలో మొట్టమొదటిసారిగా నిర్వహించారు.

## పుష్పగిరి ఆలయ శిల్పసంపద రమణీయం



పుష్పగిరి చెన్నకేశవాలయంలో శిల్పాలు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 14: పుష్పగిరి ఆలయ శిల్పసంపద రమణీయమని వైవీయూ లలిత కళల విభాగాధిపతి డాక్టర్ మృత్యుంజయరావు తెలిపారు. ఆదివారం పుష్పగిరిలో చెన్నకేశవాలయంలో శిల్ప సంపదను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ రాయలసీమలో ఉన్న శిల్ప సంపదను కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాయలసీమ దేవాలయాల్లో కన్నా చాలా సున్నితంగా చిన్న చిన్న వివరాలను సైతం సూక్ష్మమైన శిల్పాల్లో చూపించడం చాలా గొప్ప విషయమన్నారు. కవి భారవి రచించిన కిరాతార్జునీయం అంశంపై పరిశోధన వ్యాసం నిమిత్తం చెన్నకేశవాలయం ప్రాకారాలపై అధ్యయనం చేశామన్నారు. లేపాక్షి దేవాలయం, కిరాతార్జునీయం కథను ఒకే గోడపై చక్కగా పుష్పగిరిలో చాలా చిన్న పరిమాణంలో కీలక ఘట్టాలను ఒకేచోటున కాకుండా ఆలయ అధిష్ఠానం నలుదిక్కులా గోడలపై ఐదుఘట్టాలుగా చెక్కించారన్నారు. కథపై ఆసక్తిగొలిపేందుకే శిల్పి ఇలా చెక్కి ఉంటాడని తెలిపారు. ఆరంగులాల ఎత్తు నుంచి పది అంగుళాల పరిమాణంలో శ్రీ మహావిష్ణువు, వృషభ రూఢ మూర్తి, నటరాజు, అంధకాసుర మూర్తి, నాట్యగణపతి, రామలక్ష్మణులు, వరాహమూర్తి ప్రతిమలను సున్నితమైన వివరాలతో ఆభరణాలతో నిండుగా చిత్రించడం గొప్ప విషయమని అలాంటి అద్భుత కళను అందరూ చూడాలన్నారు. విజయనగర శిల్ప కళావైభవం ప్రతీకకు ఉచ్ఛదశలో కళ అని ఈ శిల్పాల్లో చోళ శిల్పశైలి మిళితమై కనిపిస్తాయన్నారు.

## ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



ఇసుక ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలింపు చేసిన దృశ్యం

జమ్మలమడుగు, జూలై 14: నాలుగు నెలల నుంచి జమ్మలమడుగులో ఇసుక ట్రాక్టర్లు పట్టుకోవడంలేదని విమర్శలున్నాయి. అధికారులు, సిబ్బంది అక్రమ ఇసుకాసురులపై స్పందించడంలేదని స్థానిక ప్రజల ద్వారా ఆరోపణలున్నాయి. అయితే ఇటీవల కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అక్రమ ఇసుకాసురులను పట్టుకోవాలని పోలీసులకు ఆదేశాలిచ్చారు. అయితే పోలీసు అధికారులు కొందరిని మాత్రమే పట్టుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకుని ఆర్టీసీ గ్యారేజీలో పోలీసులు పెట్టారు. అందుకు సంబంధించి యజమాని స్టేషన్ చుట్టూ తిరిగినా జరిమానా విధించకుండా ఇబ్బంది కలిగిస్తున్నట్లు బాధిత వ్యక్తి తెలిపారు. అయితే శనివారం రాత్రి మరో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాటిని ఆదివారం సాయంత్రం ఆర్టీసీ గ్యారేజీలోకి తీసుకెళ్లారు. ఈ సమస్యకు సంబంధించి అర్బన్ పోలీసు స్టేషన్ ఎఎస్‌ఐ మురళీయాదవ్‌ను వివరణ కోరగా శనివారం రాత్రి రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు వాటిని ఆర్టీసీ గ్యారేజీలోకి చేర్చినట్లు ఆయన తెలిపారు. ఈ సమస్యలకు సంబంధించి జిల్లా పోలీసు అధికారులు పట్టణంలో అక్రమ ఇసుక రవాణాపై విచారణ జరపాలని లేదా పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందిని అడిగి విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు.

### ఇసుక లారీల పట్టివేత

ఎర్రగుంట్ల, జూలై 14: పోట్లదుర్తి సమీప పెన్నా నదీ పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న వాహనాలను శనివారం అర్ధరాత్రి ఎర్రగుంట్ల పోలీసులు పట్టుకున్నారు. రెండులారీలు, ఒక ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కిలో మటన్ రూ.500

### కడప, ప్రొద్దుటూరు నుంచి క్యూ కట్టిన మాంసం ప్రియులు
### టోకెన్ సిస్టంతో మధ్యాహ్నం వరకూ తగ్గని జనం



మాంసం దుకాణాల వద్ద గుంపులుగా ఉన్న జనాలు

మైదుకూరు రూరల్ జూలై 14: మైదుకూరులో మాంసం ధరలు కొందరు వ్యాపారులు అమాంతం తగ్గించేశారు. ఒకరిపై ఒకరు పోటీగా మాంసం విక్రయాలు సాగించారు. దీంతో ప్రజలకు తక్కువ ధరలకే మాంసం రావడంతో భారీగా కొనుగోలు చేశారు. మాంసం విక్రయాలు మైదుకూరులో రోజు రోజుకూ వ్యాపారాలు పెంచుకుంటూ కిలో పొట్టేలు మాంసం ధర ఎనిమిది వందలు చేసేశారు. కాగా విక్రయాలు మందకొడిగా సాగుతూ వస్తున్నాయి. అయితే ఈ ఆదివారం కడప రోడ్డులోని కొందరు వ్యాపారులు కిలో మాంసం ధర కేవలం రూ.500లు చేసి విక్రయాలు సాగించారు. ఈ ఆఫర్‌తో మాంసం కోసం జనాలు తండోపతండాలుగా వచ్చి కొంటున్నారు. మైదుకూరు, చుట్టుపక్కల పల్లెల నుంచే కాకుండా ప్రొద్దుటూరు, కడప నుంచి కూడా చార్జీలు పెట్టుకుని వచ్చి మరీ కొనుగోలు చేశారు. దీంతో కొనుగోలుదారులకు టోకెన్ సిస్టం కూడా ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం రెండుల గంటల వరకు మాంసం అమ్మకాలు సాగించారు. మాంసం తక్కువ ధరకు అమ్మకంపై వ్యాపారిని వివరణ అడుగగా పెద్ద మొత్తంలో పొట్టేళ్లను కోస్తే ఎవరికైనా రూ.500 గిట్టుబాటవుతుందన్నారు. చికెన్ ధరలు కూడా ప్రొద్దుటూరు, కడప కంటే మైదుకూరులో ఎక్కువ ధరకు అమ్ముతున్నారని ప్రజలు వాపోతున్నారు. చికెన్, మాంసం ధరల విషయంలో మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## వ్యక్తిని గుర్తించండి



గుర్తు తెలియని వ్యక్తి

ప్రొద్దుటూరు క్రైం, జూలై 14: ఇతని వయస్సు 30 ఏళ్లు ఉంటాయని. ప్రభుత్వాస్పత్రిలో చేర్పించామని, వ్యక్తిని గుర్తించండి అని త్రీటౌన్ సీఐ వెంకటరమణ తెలిపారు. మద్యం తాగి మత్తులో ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, అతన్ని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించినట్లు ఆయన తెలిపారు. తన ఊరు నంద్యాల అని చెబుతున్నాడని సీఐ తెలిపారు. ఇతను ప్రభుత్వాస్పత్రిలో ఉన్నాడని, పూర్తి సమాచారం తెలిస్తే 9121100589కు తెలియజేయాలని ఆయన కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామాపురం, జూలై 14: కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లె వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటర్, సుమో ఢీకొని నాగభాస్కర్ (45) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... చిట్లూరు గ్రామం పాలన్నగారిపల్లె వాసి నాగభాస్కర్ రోడ్డుపై నిలబడి ఉండగా కడప నుంచి రాయచోటి వైపు వెళ్తున్న స్కూటర్ అతన్ని ఢీకొని రాయచోటి వైపు వెళ్లిపోయింది. వెనుకవైపు నుంచి వచ్చిన సుమో అతని తలపై సుమో ఎక్కడంతో తల, మొండెం రెండు భాగాలైంది. దీంతో నాగభాస్కర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి రామాపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## ఇమామ్ పీర్లు ఊరేగింపు



ఇమామ్ పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

చిన్నమండెం, జూలై 14: మఖాన్ వద్ద గురువారం నుంచి వైభవంగా సాగుతున్న మొహర్రం సందర్భంగా ఆదివారం పాతస్టేట్ బ్యాంక్ దగ్గర, మఖాన్‌లోని గంధం పీరు దగ్గర ఉన్న ఇమామ్ పీర్లను సొంత బజారులోని సంతూప్ వరకు ఊరేగించి తిరిగి ఆ పీర్ల స్థానంలో నిల్పోబెట్టారు. ఈ ఊరేగింపు సంప్రదాయ పద్ధతిలో మత గురువుల ప్రార్థనలతో వైభవంగా సాగింది. శనివారం రాత్రి పాత స్టేట్‌బ్యాంక్ దగ్గర ఉన్న అగ్నిగుండాలను భక్తిశ్రద్ధలతో కాల్చారు. ఆదివారం రాత్రి పీర్ల మఖాన్ దగ్గర ఉన్న రెండు అగ్నిగుండాలను కాలుస్తారని మొహర్రం కమిటీ సభ్యులు తెలిపారు. గంధపు పీరును దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.




# అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



మృతురాలు రాజమ్మ (ఫైల్ ఫొటో)

పెద్దతిప్పసముద్రం జూలై 14: అనుమానాస్పద స్థితిలో రాజమ్మ(48) శనివారం రాత్రిమృతి చెందింది. పీటీఎం ఎస్ఐ రవీంద్రబాబు కథనం మేరకు పీటీఎం మండలం మద్దయ్యగారిపల్లె పంచాయతీ బురుజుపల్లె వాసి గంగులప్ప భార్య రాజమ్మ శనివారం గ్రామ శివారులోని పొలాల్లోకి వేపగింజలు ఏరుకునేందుకు వెళ్లిందన్నారు. ఆ సమయంలో అదే గ్రామస్తుడు ఆదెప్ప తమ పొలంలో వేప గింజలు ఎలా ఏరుతావా అంటూ ఆమెపై దాడికి పాల్పడినట్లు తెలిసిందన్నారు. కాగా ఆదివారం ఉదయం రాజమ్మ మృతి చెందినట్లు సమాచారం రావడంతో పీటీఎం పోలీసులతో కలిసి బురుజుపల్లెకు చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కాగా పోస్టుమార్టం రిపోర్టు వస్తేగాని ఆమె మృతికి గల కారణాలు తెలుస్తాయని ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.




## ఆవు పొడవడంతో పదిమందికి తీవ్ర గాయాలు

### ఆవులను బంధించిన మున్సిపల్ సిబ్బంది

ప్రొద్దుటూరు, జూలై 14: ఆవు మనుషులపై దాడిచేస్తూ పదిమందికి పైగా తీవ్రంగా గాయపరిచింది. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఎక్కడ చూసినా ఆవులు గుంపులు దర్శనమిస్తున్నాయి. ఆవుల యజమానులు వాటిని రోడ్లపైకి వదలడం వలన ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం రాత్రి గవిని సర్కిల్ ఆదర్శనగర్ దగ్గర నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు ఒక ఆవు పదిమందికి పైగా తీవ్రంగా గాయపరిచింది. దీంతో కొందరు ప్రైవేటు ఆస్పత్రికి చికిత్సకోసం వెళితే మరికొందరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. ఓ మహిళలను ఆవు కొమ్ములతో ఎత్తి కింద వేయడంతో ఆమెకు తీవ్ర గాయాలై చెయ్యి విరిగింది. ఆవు బీభత్సంపై పోలీసులకు మున్సిపల్ అధికారులకు ఫోన్ చేశారు. దీంతో మున్సిపల్ శానిటరీ అధికారులు సిబ్బంది వల వేసి ఆవును బంధించారు. తరువాత క్రేన్ సహాయంతో దానిని ట్రాక్టర్‌లో వేసి బయటికి తరలించారు. ఆవులను యజమానులు తమ గృహాల్లో పెంచుకోవాలని తెలిపారు.

## బీజేపీకి ఘోరపరాభవం : తులసిరెడ్డి



వేంపల్లెలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపదకేంద్రాన్ని చూపుతున్న తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 14: దేశంలోని ఏడు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బీజేపీకి ఘోరపరాభవం జరిగిందని కాంగ్రెస్ సీనియర్ నేత తులసిరెడ్డి అన్నారు. దేశంలో మారుతున్న రాజకీయ పవనాలకు ఇది ఒక సంకేతమన్నారు. ఈ ఏడాది చివరిలో నాలుగు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లో ఇదే ఫలితాలు పునరావృతమై ఇండియా కూటమి గెలుస్తుందన్నారు. ఈ ఏడాది చివరిలో జరిగే నాలుగు రాష్ట్రాల ఎన్నికల తర్వాత మోదీ ప్రభుత్వం కూలిపోతుందన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద గతంలో రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల్లో ఏర్పాటు చేసిన చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో చెత్త సంపద తయారీ కేంద్రాలు మూలన పడ్డాయని, పర్యవసానంగా పారిశుధ్యం పడకేసిందన్నారు. ఇప్పటికే ఉన్న కేంద్రాలను ఉపయోగించి మళ్లీ పారిశుధ్యం మెరుగు, సంపదను పెంపొందించాలని ఆయన సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షపాత్ర పోషించాల్సిన వైసీపీ బీజేపీ చేతిలో కీలుబొమ్మగా మారిందన్నారు. ఇటీవల లోక్‌సభ ఎన్నిక సందర్భంగా వైసీపీ బీజేపీకి మద్దతు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని ఐదేళ్ల తర్వాత వచ్చే ఎన్నికల్లో దేశంలోను,రాష్ట్రంలోను కాంగ్రెస్ పార్టీ అధికారం చేజిక్కించుకునేందుకు కృషిచేస్తుందన్నారు.



## వెల్లటూరులో ఘనంగా చిన్నసరిగెత్తు



ఊరేగింపుగా వెళ్తున్న పీర్లు

పెండ్లిమర్రి, జూలై 14: మండలంలోని వెల్లటూరు గ్రామంలో మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం చిన్నసరిగెత్తు కార్యక్రమం ఘనంగా జరిగింది. మాజీసర్పంచు పెద్ద మల్లారెడ్డి కుటుంబీకులు పీరుకు పూలమాలలు సమర్పించి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. హిందూ, ముస్లింలు సోదర భావంతో కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళవారం రాత్రి గుండం కార్యక్రమం, బుధవారం పెద్దసరిగెత్తు కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు బాబా ఫక్రుద్దీన్, బాబు, మీరుసాహెబ్ తెలిపారు.

## విద్యుత్‌షాక్‌తో కౌలు రైతు మృతి

సిద్దవటం, జూలై 14: నేకనాపురం వాసి, కౌలు రైతు కొండా పాలకొండయ్య విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఉదయం భార్య నీలమ్మతో పసుపు పంటకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లి స్టాటర్ ఆన్ చేస్తుండగా స్టాటర్ నుంచి విద్యుత్ ప్రసారమై అక్కడికక్కడే కుప్ప కూలిపోయాడు. భార్య వేసిన కేకలతో స్థానికులు పరిశీలించి మృతిచెందాడని తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలియజేశారు.

# అలంకారప్రాయంగా సంత

- లక్షలు ఖర్చు చేసినా నిరుపయోగం
- ప్రణాళిక లేక రూ.15 లక్షల నిధులు నీటిపాలు

చిట్వేలి, జూలై 14: గ్రామీణ ప్రాంత రైతుల కోసం లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం అలంకార ప్రాయంగా దర్శనమిస్తోంది. ప్రణాళిక లేక నిధులు నీటిపాలయ్యాయి. రైతుల అభివృద్ధే ధ్యేయంగా చెప్పుకున్న గత ప్రభుత్వం రైతు సంతబజారు అభివృద్ధిపై చొరవ చూపక పోవడంతో ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా 2019లో రూ.15 లక్షల నాబార్డు నిధులతో మండలంలోని పాతచిట్వేలి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయం వద్ద 20 గదులతో నిర్మించారు. దీంతో రైతులు తాము పండించిన కూరగాయలను తామే విక్రయించుకోవచ్చన్న ఆలోచన కలగా మిగిలిపోయింది. వైసీపీ ప్రభుత్వం ఉన్న 5 సంవత్సరాల్లో రైతు సంతపై ఎటువంటి శ్రద్ధ చూపకపోవడంతో గదులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అయితే ఈ కట్టడాలు రైతుల కోసమా, కాంట్రాక్టర్ల కోసమా అని మండల ప్రజల నుంచి విమర్శలు వినపడుతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్మించిన భవనాన్ని అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న రైతు సంత

## సీఎంతో టీడీపీ నేత భేటీ


సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజంపేట, జూలై 14: సీఎం చంద్రబాబునాయుడుతో రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాజంపేట ప్రాంతంలో గత వైసీపీ పాలనలో వైసీపీ నాయకులు భారీఎత్తున భూకబ్జాలకు పాల్పడ్డారని, వీరిపై చర్యలు తీసుకుని ఆ భూములను పేదలకు పంచిపెట్టాలని సీఎంకు వివరించారు. అదేవిధంగా రాజంపేట నియోజకవర్గంలో టీడీపీ స్థితిగతుల గురించి తెలియజేశారు. కాగా తనకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని కోరారు.

## రైళ్ల నిలుపుదలకు వినతి

పుల్లంపేట, జూలై 14: పుల్లంపేట రైల్వేస్టేషన్‌లో నంద్యాల-రేణిగుంట డెమో రైలు, తిరుపతి-గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలని మండల ప్రజలు ఆదివారం పుల్లంపేట రైల్వేస్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గ్రామస్థులు రైల్వేస్టేషన్‌కు వెళ్లి వినతిపత్రం ఇచ్చారు. పుల్లంపేట రైల్వేస్టేషన్‌లో తిరుపతి హుబ్లీ ప్యాసింజర్ రైలు, అరక్కోణం - కడప ప్యాసింజర్ రైళ్లకు మాత్రమే స్టాపింగ్ ఉందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి చేరుకోవడానికి, గుంటూరు ప్రాంతంలో చదివే విద్యార్థుల కోసం ఈ రైళ్లను పుల్లంపేట స్టేషన్‌లో స్టాపింగ్ ఇవ్వాలని వారు కోరారు.

## వరుణుడి కోసం బోనాలు


బోనాలతో బయలుదేరుతున్న కుర్వపల్లె యువకులు

చిన్నమండెం, జూలై 14: మండలంలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీ కుర్వపల్లెలో వరుణుడి కోసం బోనాలు పడతారు. ఈ ఏడాది వర్షాలు బాగా పడతాయని వాతావరణశాఖ హెచ్చరించడంతో ఎంతగానో ఆశలు పెట్టుకున్న అన్నదాతల ఆశలు అడియాశలయ్యాయి. దీంతో అక్కడక్కడ వేసిన వేరుశనగ వర్షాలు లేక ఎండిపోతోంది. దీంతో కుర్వపల్లెలో ప్రతియేటా వర్షం కోసం ఆనవాయితీగా ఉన్న బోనాలను ఆదివారం చేపట్టారు. పెళ్లికాని యువకులు శనివారం రాత్రి చింతలమాలిలో మంగళ వాయిద్యాలతో వెళ్లి పానకాలు, నైవేద్యాలు సమర్పించి తడి దుస్తులతో ప్రసాదాలు సమర్పించారు.

## బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా రామ్మోహన్‌శర్మ


రామ్మోహన్‌శర్మ

రైల్వేకోడూరు, జూలై 14: బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా రామ్మోహన్‌శర్మను ఆదివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కొత్తకోడూరులోని శంకరమఠంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు బ్రాహ్మణ సంఘం బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. అధ్యక్షుడితో పాటు కార్యదర్శి, కోశాధికారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు ఆర్‌సీ సురేష్‌బాబు, నరసింహశర్మ, ప్రసాద్‌రావు, రమేష్‌బాబు, సుబ్రహ్మణ్యం, నాగరాజు, పవన్‌కుమార్, యోగీశ్వర్‌శర్మ, ప్రదీప్ పాల్గొన్నారు.

## ఘనంగా పుట్టాలమ్మ జాతర

ఓబులవారిపల్లె, జూలై 14: మండలంలోని మంగంపేట అగ్రహారం పరిధిలో వెలసి ఉన్న కట్టా పుట్టాలమ్మ తల్లికి ఘనంగా జాతర నిర్వహించడం జరిగింది. మంగంపేట గ్రామ ప్రజలు, అలాగే చట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చి ఆదివారం కట్టా పుట్టాలమ్మ తల్లికి ఉదయం నుంచి పొంగుబాళ్ల కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 16 నుంచి ఆధ్యాత్మిక ప్రవచనాలు

రాజంపేట, జూలై 14: మందరం రాచపల్లె గ్రామంలో వెలసి ఉన్న ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు జరుగుతాయని ఆ గ్రామ నాయకుడు తెలిపారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 16న మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఆధ్యాత్మిక ప్రవచనాలు, 17న మహాభారతం, 18న భగవద్గీత, 19న మహిళా భక్తులచే కుంకుమ పూజ, 20 స్థానిక మండల భజన బృందంచే భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

## రేణుకా యల్లమ్మకు బోనాలు


అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న గ్రామ ప్రజలు

గాలివీడు, జూలై 14: ఆషాఢ మాసం సందర్భంగా నూలివీడు గ్రామ ప్రజలు గ్రామ దేవత అయిన రేణుక యల్లమ్మ అమ్మవారికి ఆదివారం బోనాలు సమర్పించారు. ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకోవడం ఆనవాయితీ. అమ్మవారికి బోనాలు పడితే సకాలంలో వర్షాలు కురుస్తాయని, పాడి పంటలు సంవృద్ధిగా పండుతాయని ప్రజల నమ్మకం. అమ్మవారికి బోనాల కార్యక్రమంలో బాణాసంచా పేల్చుతూ అంగరంగ వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

## జగన్ ఫొటోలు తొలగించాలి

- టీడీపీ నాయకుల ఆందోళన

రామాపురం, జూలై 14: మండలంలోని గువ్వలచెరువు గ్రామ సచివాలయం రైతు భరోసా కేంద్రంలో జగన్ ఫొటో ఉండడంతో టీడీపీ నాయకులు సుభాన్ బాషా, మాజీ రిటైర్డ్ ఏఎస్ఐ కృష్ణయ్యనాయుడు, జయచంద్ర మరో కొందరు వాటిని తొలగించాలంటూ ఆదివారం డిమాండ్ చేశారు. అలాగే మండలంలో పలు గ్రామ సచివాలయాల్లో రైతు భరోసా కేంద్రాల్లో జగన్ ఫొటో ఉండటంతో టీడీపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వచ్చి 30 రోజులు దాటినా ఇంతవరకు అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని తెలిపారు.

## సౌత్‌జోన్ క్రికెట్ టీంకు శంకరాచారి



నందలూరు, జూలై 14: మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన యువ క్రికెట్ క్రీడాకారుడు మారుతి శంకరాచారి సౌత్‌జోన్ క్రికెట్ టీమ్‌కు ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి 21 తేది వరకు విశాఖ పట్టణంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. ఎంపికలో విశేష ప్రతిభ కనబరచి ఈ పోటీలకు ఎంపికయ్యారు. గతంలో కూడా జిల్లా జట్టుకు ఎంపికై తన ప్రతిభను చాటారు. మారుతి శంకరాచారి సౌత్‌జోన్‌కు ఎంపిక కావడంతో పలువురు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

## హత్యరాల ఆలయంలో ప్రత్యేక పూజలు


జగన్‌మోహన్‌రాజును సత్కరిస్తున్న హత్యరాల గ్రామ ప్రజలు

రాజంపేట టౌన్, జూలై 14: రాజంపేట మండలం హత్యరాల గ్రామంలో మాతమ్మ జాతర సందర్భంగా టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతమ్మ జాతర సందర్భంగా మహిళలు, గ్రామస్థులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలను, గ్రామ ప్రజలు జగన్‌మోహన్‌రాజు దృష్టికి తెచ్చి పరిష్కరించాలని కోరగా త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, పట్టణ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో రాజంపేట విద్యార్థుల ప్రతిభ


అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు

రాజంపేట, జూలై 14: ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి మ్యాజిక్ పోటీల్లో రాజంపేట విద్యార్థులు ప్రతిభ చాటి రెండు, మూడు బహుమతులను పొందారు. రాజంపేట నుంచి 11 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో రాజంపేటకు చెందిన ఎస్.అబ్దుల్లా అనే విద్యార్థి మూడో బహుమతి, మిగిలిన 9 మంది విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులను పొందారు. వీరిని శిక్షకులు రాయుడు, నందకిషోర్‌లు అభినందించారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం

రాజంపేటటౌన్, జూలై 14: రాజంపేట పాతబస్టాండు ప్రాంగణంలో పేదలకు ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నరసింహరాజు సీనియర్ సభ్యులచే ఇంజనీర్ రహిమాన్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు న్యాయవాది నాసరుద్దీన్ ఈ కార్యక్రమాన్ని చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, ఎస్.రామచంద్రరాజు పాల్గొన్నారు.

## నిందితుడిపై చర్యలు తీసుకోవాలి

- బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేశ్


బాధితుడిని పరామర్శిస్తున్న సాయిలోకేశ్

రాజంపేట,జూలై 14: ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరు గ్రామం దళిత కుటుంబానికి చెందిన కదిరి ప్రభాకర్‌ను అదే గ్రామానికి చెందిన అగ్ర కులస్థుడు వెంకటసుబ్బారెడ్డి కులం పేరుతో దూషించి కాచిన నూనెను పోసి చంపడానికి ప్రయత్నించాడని, నిందితుడిపై చర్యలు తీసుకోవాలని రాజంపేట బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం వెంకటసుబ్బారెడ్డి చేతిలో తీవ్ర గాయాలపాలై కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రభాకర్‌ను సాయిలోకేశ్ పరామర్శించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. బాధిత కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని, రాష్ట్ర డీజీపీకి, ఎస్పీకి తెలియజేసి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

**ఒంటిమిట్ట:** కదరి ప్రభాకర్‌పై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా నాయకులు నారాయణ, చంద్రశేఖర్‌లు డిమాండ్ చేశారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితుడిని సీపీఎం జిల్లా ప్రతినిధి బృందం పరామర్శించారు. దాడి చేసిన వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ, 307 కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, కోనేటి నరసయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మను దర్శించుకున్న రూపానందరెడ్డి


అనుచరులతో కలిసి ఆలయానికి వచ్చిన రూపానందరెడ్డి తదితరులు

పెనగలూరు, జూలై 14: మండలంలోని కంబాలకుంట బీసీ కాలనీలో ఆదివారం జరిగిన గంగమ్మ జాతరలో అమ్మవారిని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి దర్శించుకున్నారు. ఆయన వెంట మండల టీడీపీ, జనసేన నాయకులు కూడా పాల్గొన్నారు. ముందుగా ఈటమాపురం గ్రామంలో వెంకట్రామరాజు నివాసానికి వెళ్లి ఆయన ఆతిథ్యం స్వీకరించారు. అనంతరం కంబాలకుంట బీసీ కాలనీకి చేరుకొని గంగమ్మను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పి.రవికుమార్, కె.నాగేశ్వరయ్యనాయుడు, జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలకృష్ణ, నియోజకవర్గ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి, గుండయ్యనాయుడు, భాస్కర్‌రెడ్డి, పాల్‌రెడ్డి, జి.మహేంద్ర పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సుండుపల్లె,జూలై 14: మండల పరిధిలోని పెదినేనికాలువ పంచాయతీ సత్రం సమీపంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఆదివారం వెంకటలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కడప నగరంలోని వివిధ ఆసుపత్రులకు చెందిన 8 మంది వైద్యులు వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 350 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పలువురికి కంటి పరీక్షలు చేసి 24 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని కడపకు తీసుకెళ్లి ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. శిబిరానికి వచ్చిన వారందరికీ నిర్వాహకులు భోజనవసతులు కల్పించారు.

## బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలిగా ఆదిలక్షుమ్మ

చిట్వేలి, జూలై 14: మండల మహిళా మోర్చ అధ్యక్షురాలిగా ఆదిలక్షుమ్మను నియమించినట్లు బీజేపీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు సునీత, బీజేపీ మండల అధ్యక్షుడు బాపూజీలు తెలిపారు. ఆదివారం వడ్డెపల్లెలో బీజేపీ మోర్చ నాయకులతో కలిసి నియామకపత్రాన్ని అందించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## రక్షణ కల్పించాలంటూ బాధితుల వేడుకోలు


న్యాయం చేయాలంటూ వేడుకొంటున్న బాధితులు

రాయచోటిటౌన్, జూలై 14: గత 15 సంవత్సరాలుగా మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అనుచరుడిగా ఉంటూ భూకబ్జాలకు పాల్పడి ఇటీవల టీడీపీలో చేరిన ఓ విద్యాసంస్థల డైరెక్టర్ నుంచి తమకు రక్షణ కల్పించాలంటూ రాయచోటికి చెందిన టీడీపీ అభిమానులు కోరుతున్నారు. ఈ మేరకు షేక్ యాస్మిన్, నగేశ్, మనోహర, ఈశ్వరయ్య, శివయ్య, నారాయణ, చలపతి, శ్రీనివాసులు తదితరులు సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్, రాంప్రసాద్‌రెడ్డిలకు వినతిపత్రం అందించారు. వివరాల్లోకెళ్తే... రాయచోటి మండల పరిధిలోని యండపల్లి గ్రామం సర్వే నెంబరు 477లో 1.53 ఎకరాలు (సుమారు రూ.2 కోట్లు విలువ)ను పెద్దకాల్వపల్లెకు చెందిన నాయకులు రాయచోటి మున్సిపాల్టీతో పాటు యండపల్లె గ్రామ పంచాయతీలో సుమారు 100 ఎకరాలకు పైగా పేదల భూములను ఆక్రమించుకున్నారని ఫిర్యాదులో వివరించారు. అక్రమాలకు పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు.

## వేడుకగా పీర్ల ఉత్సవం

పెనగలూరు, జూలై 14: మొహరం పండుగ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం మండలంలోని పలు గ్రామాల్లో పగటి పీర్ల ఉత్సవం వైభవంగా జరిగింది. మండల కేంద్రంలోని పి.కొత్తపల్లె, ఓబిలి, నల్లపురెడ్డిపల్లె, నాయుడువారిపల్లె గ్రామాల్లో సాయంత్రం నాలుగు గంటల నుంచి సంప్రదాయబద్ధంగా పీర్ల ఊరేగింపు కార్యక్రమం జరిగింది. ఇదిలా ఉండగా పి.కొత్తపల్లె, పెనగలూరు గ్రామాలకు చెందిన పలువురు దూదేకుల నూర్‌బాషా సంఘం సభ్యులు, హిందూ, ముస్లిం సభ్యులు ఘనంగా ఊరేగింపులో పాల్గొన్నారు.

## పారిశుధ్య చర్యలతో ప్రజల ప్రాణాలు పదిలం

- పంతగాని నరసింహప్రసాద్


రైల్వేకోడూరులో పారిశుధ్య కార్మికులతో కలసి చెత్తను ఊడుస్తున్న పంతగాని

రైల్వేకోడూరు,జూలై 14: పారిశుధ్య చర్యలతో ప్రజల ప్రాణాలు పదిలంగా ఉంటాయని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున పారిశుధ్య కార్మికులతో కలిసి చెత్తచెదారాలను తొలగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో జవాన్లు కాపలాకాసి ప్రజల ప్రాణాలను ఎలా కాపాడుతున్నారో అలానే ప్రతి ఊరిలోనూ పారిశుధ్య కార్మికులు ప్రజలు పారేసిన చెత్తచెదారాలను తొలగించి ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. డయేరియా తదితర వ్యాధులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు విన్నవించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. తదనంతరం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుడిని ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లెం హేమంత్, సూర్యప్రకాశ్‌నాయుడు, కస్తూరి దినేష్, సంజు, హరి, రాయుడు, శివ, శంకర్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఏపూరమ్మకు బోనాలు


బోనాలతో ఆలయంలో వేచి ఉన్న మహిళలు

సుండుపల్లె,జూలై 14: మండల పరిధిలోని తిమ్మసముద్రం ఏపూరమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఆదివారం ఉదయం తిమ్మసముద్రం, లగిశెట్టిపల్లె గ్రామాల్లో ఇంటింటి నుంచి పోతులరాజు విగ్రహం ముందు తీసుకెళ్తుండగా మహిళలు, బోనాలు తీసుకుని గ్రామోత్సవంతో ఆలయానికి వచ్చారు. పలకలు, డ్రమ్స్ వాయిస్తూ గ్రామస్తులు అట్టహాసంగా అమ్మవారికి బోనాలు తీసుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం బోనాలు ఉంచి పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి అర్చనలు చేశారు.

## శ్మశాన స్థలాన్ని ఏర్పాటు చేయండి


శ్మశాన స్థలాన్ని ఏర్పాటు చేయాలని వేడుకుంటున్న దళిత మహిళలు

రామాపురం,జూలై 14: తమకు శ్మశాన స్థలాన్ని ఏర్పాటు చేయాలని మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తరోడ్డు నారాయణపురానికి చెందిన దళితులు వేడుకుంటున్నారు. తమ గ్రామంలో ఎవరైనా చనిపోతే శ్మశాన స్థలం లేక వంకలు, వాగులు, చెరువుల్లో, కుంటల్లో అంత్యక్రియలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆ గ్రామానికి చెందిన మహిళలు నాగరత్న, అమరావతి, గంగోజమ్మ, నాగమ్మ, రామలక్ష్మమ్మ, రవణమ్మ, భాగ్యమ్మ, అంజనమ్మ, గంగాదేవి, అనసూయమ్మ, మునియమ్మ, రామాంజులు, చిన్నప్ప, లక్ష్మమ్మ, భూషణమ్మ తదితరులు కోరారు. ఆదివారం వారు విలేకర్ల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం ఏర్పడి 40 ఏళ్లు కావస్తున్నా ఇంతవరకు శ్మశాన స్థలం లేకపోవడం దారుణమన్నారు. గోపగుడిపల్లె గ్రామ సర్వే నెంబరు 755లో ప్రభుత్వ భూమి ఉన్నదని, అందులో శ్మశానానికి ఒక ఎకరా భూమిని అధికారులు కేటాయిస్తే బాగుంటుందని గ్రామస్తులు తెలిపారు.

## మంచి ఆహారంతోనే ఆరోగ్యం : సుగవాసి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, జూలై 14: మనిషి ఆరోగ్యం మంచి ఆహారంతో పాటు పరిసరాల పరిశుభ్రతతోనే సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్తపల్లె ప్రాంతంలో గల బడే కరీమియా మసీదు ఆవరణంలో ఎంఏ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు ఉచితంగా వైద్య సేవలందించేందుకు ముందుకు వచ్చిన సొసైటీ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో మండిపల్లి రాహుల్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి వతన్‌నిస్సార్, రాజంపేట మైనార్టీ కార్యదర్శి ఇర్షాద్‌ఖాన్‌లతో పాటు వైద్య బృందం పాల్గొన్నారు.

## నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుమిత్ర


సమావేశంలో మాట్లాడుతున్న సుమిత్ర

రాయచోటిటౌన్, జూలై 14: విజయనగరం జిల్లా రామభద్రపురంలో ఉయ్యాలలో ఉన్న ఆరు నెలల ముక్కుపచ్చలారని పసికందుపై అఘాయిత్యానికి పాల్పడిన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సుమిత్ర అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళా లోకానికి రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య నియోజకవర్గ నాయకురాలు అరుణమ్మ, సుబ్బమ్మ, ఆదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం చంద్రబాబు

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా


విలేకరులతో మాట్లాడుతున్న ఖాదర్‌బాషా, తదితరులు

రాయచోటి టౌన్, జూలై 14: నీతి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం సీఎం చంద్రబాబునాయుడు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ నేతలను ప్రజలు ఛీ కొట్టినా సిగ్గు లేకుండా మాజీ మంత్రులు అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని వైసీపీ నేతలపై ధ్వజమెత్తారు. గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు ఇసుకాసుర అవతారమెత్తి రాష్ట్ర ఖనిజ సంపదను దోచుకుతిన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంజద్‌అలీ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్‌నాయుడు, నాగార్జున, రెడ్డయ్య, అమీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.





# 'కొండ'ంత వివాదం!

ఒకరి మెప్పుకోసం ఆయన 'కొండ'ంత వివాదాస్పదుడిగా మారారు. టీటీడీలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఆయన నిర్ణయాలు, చర్యలు ఏ ఒక్కరి నుంచీ ప్రశంసలను పొందకపోగా అన్నివర్గాల విమర్శలకు, ఆరోపణలకు గురయ్యాయి. టీటీడీలో మూడు పర్యాయాలు కీలకంగా పనిచేసిన ఆయన ప్రతిసారీ వివాదాస్పద పరిస్థితుల్లో, అవమానకరంగా నిష్క్రమించారు. ఆ అధికారే టీటీడీ మాజీ ఈవో ఏవీ ధర్మారెడ్డి. కూటమి అధికారంలోకి వచ్చాక ఆయన నిర్ణయాలు, చర్యలపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. ఇందులో ఏవి వెలుగు చూస్తాయి? ఆయనపై ఎలాంటి చర్యలుంటాయన్న చర్చ అన్ని వర్గాల్లో నడుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఒకరి మెప్పుకోసం ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ధర్మారెడ్డి

ఐదేళ్లూ ఆయనపై విమర్శలు, ఆరోపణలు

అందరి దృష్టీ విచారణ పర్యవసానాలపైనే!

ప్రభుత్వం మారాక ఫిర్యాదుల వెల్లువ

## ఇప్పటికే రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు

కేంద్ర రక్షణ శాఖలో ఐడీఈఎస్ అధికారైన ఏవీ ధర్మారెడ్డి టీటీడీలో మూడుసార్లు డిప్యుటేషన్‌పై పనిచేశారు. ప్రతిసారీ ఆయన పనితీరు వివాదాస్పదమే. తొలిసారి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నపుడు ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసి 2004 జూలై 5న ధర్మారెడ్డిని టీటీడీలో తిరుమల జేఈవో పోస్టులో ఓఎస్డీగా నియమించారు. రెండేళ్లపాటు ఆ పోస్టులో ధర్మారెడ్డి కొనసాగారు. అప్పటి పాలకమండలి చైర్మన్‌గా నియమితులైన భూమన కరుణాకర్‌రెడ్డి కంటే ముందుగానే సభ్యురాలిగా టి.సుబ్బరామిరెడ్డి సతీమణి ఇందిరతో ప్రమాణస్వీకారం చేయించడం వివాదంగా మారింది. దీన్ని అవమానంగా భావించిన కరుణాకర్‌రెడ్డి.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వద్ద పట్టుబట్టి ధర్మారెడ్డిని బదిలీ చేయించారు. భూమన పదవీకాలం ముగిశాక 2008 ఏప్రిల్ 2న మరోసారి ధర్మారెడ్డి టీటీడీకి డిప్యుటేషన్‌పై వచ్చారు. తిరుమల జేఈవో పోస్టులో ఓఎస్డీగా నియమితులై 28 నెలల పాటు పనిచేశారు. ఈయన వద్ద క్యాంపు క్లర్క్‌గా పనిచేస్తున్న సురేష్ ఆత్మహత్య చేసుకోవడంతో ధర్మారెడ్డి వేధింపులే కారణమని మృతుడి కుటుంబీకులు, ఉద్యోగ సంఘాలు అప్పట్లో ఆందోళనకు దిగాయి. దీంతో 2010 ఆగస్టు 31న ప్రభుత్వం మరోసారి ఆయనపై బదిలీ వేటు వేసింది. వైఎస్ జగన్ సీఎం కాగానే 2019 జూలై 12న మూడోసారి ధర్మారెడ్డి డిప్యుటేషన్‌పై టీటీడీలో స్పెషలాఫీసర్‌గా తిరుమల జేఈవో పోస్టులో నియమితులయ్యారు. ఈసారి ప్రభుత్వం ఆయన కోసం జేఈవో పోస్టును అదనపు ఈవోగా స్థాయి పెంచింది. 2022 నవంబరులో ఈవో జవహర్‌రెడ్డి బదిలీ కావడంతో ఈవో పోస్టును కూడా ధర్మారెడ్డికే కట్టబెట్టింది. దీంతో టీటీడీలో ఆయన సర్వాధికారిగా మారారు.

### ఇప్పుడూ అవమానకర నిష్క్రమణే

మూడోసారి నియమితులైన ధర్మారెడ్డి ఐదేళ్లపాటు టీటీడీలో ఎదురులేని వ్యక్తిగా అధికారం చెలాయించారు. అధికార పార్టీ నేతలనూ లెక్కచేయలేదు. ప్రభుత్వం మారడంతో సెలవు పెట్టి వెళ్లిపోయేందుకు యత్నించారు. ఆయనపై తీవ్ర ఆగ్రహంగా ఉన్న కొత్త ప్రభుత్వం సెలవు పెట్టడానికి అంగీకరించలేదు. సీఎం చంద్రబాబు తిరుమలకు వచ్చే క్రమంలో ధర్మారెడ్డి ముఖం చూడడం కూడా ఇష్టపడక పోవడంతో అప్పటికప్పుడు వారం పాటు సెలవుపై పంపించింది ప్రభుత్వం. తర్వాత ఆయనే సెలవు పొడిగించుకుని గత నెలాఖరున సెలవులో ఉండగానే సర్వీసు నుంచి రిటైరయ్యారు. కనీసం అధికారికంగా టీటీడీ యంత్రాంగం వీడ్కోలు పలికే పరిస్థితి కూడా లేదు. గతంలో రెండుసార్లు అవమానకర రీతిలో బదిలీ అయిన ఆయన.. మూడోసారి మాత్రం అనామకంగా, అవమానకరంగా కొండ దిగాల్సి వచ్చింది.

### ఐదేళ్లూ ఆరోపణలు.. ఇపుడు ఫిర్యాదులు

టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చిన ధర్మారెడ్డి తీరుపై వైసీపీ మినహా మిగిలిన అన్ని రాజకీయ పార్టీల నేతలూ మండిపడ్డాయి. ప్రతిపక్ష నేత హోదాలో టీడీపీ అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ జిల్లాలోనూ, వెలుపలా కూడా అనేక సందర్భాల్లో ధర్మారెడ్డి తీరుపై నిప్పులు చెరిగారు. అప్పటి టీటీడీ వ్యవహారాలపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి సంబంధించి కేంద్ర మంత్రులూ ధర్మారెడ్డి తీరుపై ఫిర్యాదులు చేశారు. స్థానిక నేతలైతే ఆందోళనలకు దిగిన సందర్భాలూ ఉన్నాయి. అనేక అంశాలపై కోర్టుల్లోనూ పోరాడారు. చివరికి కమ్యూనిస్టు నేత నారాయణ వంటి వారూ ధర్మారెడ్డి నిర్ణయాలను ఆక్షేపించినవారే. కూటమి అధికారంలోకి రావడంతో ఇప్పుడు నేరుగా ప్రభుత్వానికే ఫిర్యాదులు చేస్తున్నారు. కొందరు సీఎం చంద్రబాబుకు, మరికొందరు సీఎస్‌కు, ఇంకొందరు డీజీపీకి, సీఐడీ చీఫ్‌కు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి, ఏసీబీకి సైతం ఫిర్యాదులు చేస్తున్నారు. ఒకరిద్దరు తమ ఫిర్యాదులకు ఆధారాలూ జతచేశారు.

### ధర్మారెడ్డి హయాంలో మసకబారిన టీటీడీ ప్రతిష్ఠ

టీటీడీ చరిత్రలో ఏ అధికారీ చేయని రీతిలో ధర్మారెడ్డి అధికారం చెలాయించారు. నిరంకుశుడనే పేరు తెచ్చుకున్నారు. అప్పట్లో సీఎం జగన్‌కు సన్నిహితుడనే కారణంగా అధికార పార్టీలోనూ అతికొద్ది మంది ముఖ్య నేతలను మినహా మిగిలిన వారిని ఖాతరు చేయలేదు. మంత్రులు సైతం ఆయన నుంచి అవమానాలు ఎదుర్కొన్నవారే. దర్శనాల విషయంలోనూ అతి కొద్దిమందికే పెద్దపీట వేశారు. జగన్‌పై ఉన్న అక్రమాస్తుల కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలను, న్యాయమూర్తులను ప్రభావితం చేసేందుకు టీటీడీని, శ్రీవారి దర్శనాలను దుర్వినియోగం చేశారన్నది ఆయనపై ఉన్న ప్రధాన ఆరోపణ. ఓ హైకోర్టు న్యాయమూర్తికి ఖరీదైన వాచీ ఇవ్వజూపారని, మరెందరో న్యాయమూర్తులు తమకు తామే ఎబ్బెట్టుగా భావించేలా తిరుమలలో అతి మర్యాదలు చేయబోయారన్న ఆరోపణలూ ఉన్నాయి. మరోవైపు వైసీపీ ముఖ్యులకు, పాలకమండలి ముఖ్యులకు లబ్ధి కలిగించేలా నిధుల కేటాయింపులు జరిపి ఆర్థిక పరమైన తప్పిదాలకు పాల్పడ్డారనే ఆరోపణలు టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీశాయి. దర్శన టికెట్ల కేటాయింపు, శ్రీవాణి ట్రస్టుద్వారా విరాళాల మళ్లింపు, ఇంజనీరింగ్ పనులకు అవసరం లేకున్నా రూ.వేల కోట్ల కేటాయింపు వంటివి ఆయనపై ఉన్న ఇతర ఆరోపణలు. వీటికితోడు మితిమీరిన అహంకారం, వ్యక్తిగత ప్రతిష్ఠకు పోవడం, ఎదుటి వారిని ఇబ్బంది పెట్టేలా కఠినంగా వ్యవహరించే నైజమని ఆయన్ను దగ్గర్నుంచి గమనించిన టీటీడీ వర్గాలు చెబుతుంటాయి.

### విచారణ కొనసాగిస్తున్న విజిలెన్స్

టీటీడీ వ్యవహారాలపై ఇప్పటికే ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ విభాగం అధికారులు బృందాలుగా ఏర్పడి ఆయా విభాగాల్లో తనిఖీలు, విచారణలు కొనసాగిస్తున్నారు. వెలుపల అవగాహన కలిగిన వ్యక్తులను కలిసి సమాచారం సేకరిస్తున్నారు. వీటిని క్రోడీకరించుకునే పని వేగంగా జరుగుతోంది. సాధ్యమైనంత త్వరలో ధర్మారెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దానికి అవసరమైన ఆధారాల కోసం విజిలెన్స్ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. విజిలెన్స్ దర్యాప్తులో తేలే అంశాలు.. వాటి ఆధారంగా ధర్మారెడ్డిపై తీసుకునే చర్యలపైనే ఇప్పుడు రాజకీయ, టీటీడీ వర్గాలతోపాటు సామాన్య జనం దృష్టి కూడా ఉంది. ధర్మారెడ్డికి వైసీపీ అధినేత జగన్ వద్ద ఉన్న అపరిమిత పలుకుబడి కారణంగా ఇప్పుడు ఆయన్ను ఇబ్బంది పెడితే భవిష్యత్తులో తమకూ సమస్యలు ఎదురవుతాయన్న ఆందోళన విజిలెన్స్ అధికారుల్లో నెలకొన్నదని, అందుకే విచారణను సాగదీస్తున్నారనే ప్రచారం ఇప్పటికే మొదలైంది. అయితే టీటీడీ నిర్వహణలో జరిగిన ఆర్థిక తప్పిదాలను గుర్తించి.. ధర్మారెడ్డి తదితరులపై చట్టబద్ధమైన చర్యలు తీసుకునే దిశగా ప్రభుత్వం ఉందన్న ప్రచారం మరోవైపు సాగుతోంది. నిజంగానే ప్రభుత్వం ధర్మారెడ్డిపై కఠిన వైఖరి తీసుకుంటుందా లేక తప్పిదాలను ఎత్తిచూపడం వరకే పరిమితం అవుతుందా అన్నది వివిధ వర్గాలను, ప్రజల్ని ఉత్కంఠకు గురి చేస్తోంది. ఇందులో ఏదైనా నెల రోజుల్లోపే జరుగుతుందని అధికార వర్గాల సమాచారం.

## నేడు ప్రజా ఫిర్యాదుల వేదిక

చిత్తూరు, జూలై 14: కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీ కార్యాలయంలోనూ ఈ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ తెలిపారు.

## బోయకొండకు వస్తూ... వాహనం బోల్తా

● ఏడుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి కారణమైన వాహనం



గాయపడ్డ వెంకట్రాయప్ప, సుబ్బరత్నమ్మ, కృష్ణమ్మ

చౌడేపల్లె, జూలై14: బోయకొండ గంగమ్మ దర్శనం కోసం వస్తూ బొలేరా వాహనం బోల్తా పడటంతో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం చౌడేపల్లె మండలంలో చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ తాలూకా పుగనపల్లె, కొడిగిపల్లె, హన్కుర్ గ్రామాలకు చెందిన వెంకట్రాప్ప కుటింబసభ్యులు తమ బంధు మిత్రులతో కలసి బోయకొండ గంగమ్మ దర్శనం కోసం బొలేరా వాహనంలో బయలుదేరివచ్చారు. ఈక్రమంలో మండలంలోని కర్ణంవారిపల్లె సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో వెంకట్రామయ్య(60), సుగుణమ్మ(35), సుబ్బరత్న (55), కృష్ణమ్మ(45) సుమ(29), నారాయణమ్మ(40), సుశీలమ్మ(45) తీవ్రంగా గాయపడ్డారు. మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. పుంగనూరు, చౌడేపల్లె నుంచి రెండు 108 వాహనాలు రాగా ఈఎంటీ గణేష్ వారికి ప్రథమ చికిత్సలు చేశారు. మెరుగైన చికిత్సల కోసం పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## విషాదం

● ఆటో కోసం నిరీక్షిస్తుండగా తల్లీ బిడ్డలపైకి దూసుకొచ్చిన లారీ

● తల్లి, రెండేళ్ల కుమార్తె దుర్మరణం

● కుమారుడి పరిస్థితి విషమం



ప్రమాదానికి కారణమైన లారీ



వైష్ణవి, శారద (ఫైల్ ఫొటోలు)

ఏర్పేడు, జూలై 14: రోడ్డు పక్కన ఆటో కోసం నిరీక్షిస్తున్న తల్లీబిడ్డలపైకి ఓ లారీ దూసుకొచ్చింది. ఈ దుర్ఘటనలో తల్లి, రెండేళ్ల కుమార్తె దుర్మరణం చెందారు. కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడి పరిస్థితి విషమంగా ఉంది. ఈ విషాద సంఘటన ఏర్పేడు మండలం అముడూరు క్రాస్ వద్ద ఆదివారం రాత్రి ఏడు గంటలకు జరిగింది. ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాళహస్తి మండలం రామానుజపల్లె గ్రామానికి చెందిన బాపన శివకుమార్ భార్య శారద(22) తన కుమారుడు కార్తీక్(4), కుమార్తె వైష్ణవి(2)ని తీసుకుని ఈనెల 13వ తేదీన తన పుట్టిల్లు అయిన రేణిగుంట మండలం మల్లవరానికి వెళ్లింది. తిరిగి ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు రామానుజపల్లె వెళ్లడానికి ఇద్దరు బిడ్డలతోపాటు తల్లి విజయమ్మ(50)ను తీసుకుని వెంకటగిరి బస్సు ఎక్కింది. 6.45గంటల సమయంలో అముడూరు క్రాస్ వద్ద బస్సు నుంచి దిగారు. అక్కడినుంచి రామానుజపల్లెకి వెళ్లడానికి ఆటో కోసం నలుగురూ రోడ్డు పక్కన నిరీక్షిస్తున్నారు. ఇంతలో మృత్యుశకటంలా ఓ లారీ వీరిపైకి దూసుకొచ్చింది. ఈ దుర్ఘటనలో శారద అక్కడికక్కడే మృతి చెందారు. ఆస్పత్రికి తరలిస్తుండగా వైష్ణవి మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ కార్తీక్‌ని టోల్‌ప్లాజా అంబులెన్సులో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, వైద్యుల సూచనలతో రేణిగుంట మండలంలోని అమరా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా, ఈ ప్రమాదంలో శారద తల్లి విజయమ్మకు ఎలాంటి గాయాలు కాలేదు. ఏర్పేడు సీఐ కేసు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వైసీపీ నేతలపై హత్యాయత్నం కేసు

● రిమాండుకు తరలింపు

రామకుప్పం, జూలై 14: మండలంలోని 89పెద్దూరు పంచాయతీననియాల గ్రామానికి చెందిన టీడీపీ బీసీసెల్ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి మనోహర్ కుమారుడిపై దాడికి పాల్పడిన స్థానిక సర్పంచు భర్త వైసీపీ నేత గోవిందప్ప, అతని అనుచరులు సతీష్, మురుగేష్‌లపై పోలీసులు హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. రిమాండుకు తరలించారు. పోలీసుల కథనం మేరకు.. టీడీపీ నేత మనోహర్ కుమారుడు చరణ్‌సాయి(23) శనివారం సాయంత్రం తమ పొలం వద్ద ఉండగా వైసీపీ నేత గోవిందప్ప, అతని అనుచరులు సతీష్, మురుగేష్ అతన్ని బలవంతంగా గోవిందప్ప ఇంటికి తీసుకెళ్లారు. మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడి కేకలు విని అటుగా వెళ్తున్న వారు రక్షించారు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు గోవిందప్ప, సతీష్, మురుగేష్‌లపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ వారిని ఆదివారం ఉదయం అరెస్టు చేశారు. నిందితులను చిత్తూరు కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి వారికి రిమాండు విధించారు.

## 'కర్ణాటక' మార్కెట్లకు టమోటా

సోమల, జూలై 14: టమోటా పంటకు ఊహించని ధరలు పలుకుతుండడంతో రైతులు తమ పంటను కర్ణాటకకు తీసుకెళుతున్నారు. పుంగనూరు, పలమనేరు టమోటా మార్కెట్లలో ధరలు మొక్కుబడిగా మారడంతో కర్ణాటకలోని వడ్డిపల్లె క్రాస్, చింతామణి, కోలారు మార్కెట్లకు తరలిస్తున్నారు. ఆదివారం పలమనేరు, పుంగనూరు మార్కెట్లులో 15కిలోల బాక్సు కేవలం రూ.600కు మించలేదు. ఏదో ఒక మండీలో తక్కువ బాక్సులు ఉన్న రైతుకు రూ.700 ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. కర్ణాటకలో 15కిలోల బాక్సు రూ.900 నుంచి 1000కి చేరుకున్నాయి. పది రోజులుగా ఇక్కడ అధిక ధరలు పలుకుతున్నాయి. సోమల మండలం నుంచి పలమనేరుకు వాహనదారులు 15కిలోల బాక్సు రవాణాకు రూ.20 బాడుగు తీసుకుంటున్నారు. కమీషన్ 10శాతం కోత వేస్తున్నారు. కర్ణాటకలోని వడ్డిపల్లె, చింతామణికి 15కిలోల బాక్సు రవాణాకు రూ.20,రూ.22 మాత్రమే, ఇక్కడ కమీషన్ 9శాతం, కోలారు మార్కెట్‌కు రవాణా ఖర్చు బాక్సుకు రూ. 28, 30 తీసుకుంటున్నారు. ధరల్లో బాక్సుకు రూ.300 వరకు వ్యత్యాసం ఉండడంతో కర్ణాటకకు తరలిస్తున్నారు.

## జర్నలిస్టు హెల్త్‌స్కీమ్ గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 14: వర్కింగ్ జర్నలిస్టు హెల్త్‌స్కీమ్ పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఈ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు అనారోగ్యం సంభవిస్తే రూ.2 లక్షల వరకు వైద్య సేవలు అందుతాయన్నారు. సంవత్సర కాలంలో ఎన్ని సార్లయినా ఈ సదుపాయాన్ని అందిస్తారని వివరించారు.

## వర్షం కోసం వలస దేవర





గంపల్లో వంట సామగ్రిని తీసుకెళ్తున్న గ్రామస్తులు, గ్రామ దేవతలకు పూజలు



ఆలయ ప్రాంగణంలో భోజనాల తయారీ

గుడుపల్లె, జూలై 14: వర్షాలకోసం గుడుపల్లె మండలం గుడికొత్తూరులో ఆదివారం వలస దేవర నిర్వహించారు. గ్రామస్తులు ఉదయం వంట సామగ్రిని గంపల్లె పెట్టుకుని.. ఇళ్లకు తాళం వేసి, పశువులను తోలుకొని గ్రామ దేవతలైన గంగమ్మ, సలాపురమ్మ ఉత్సవర్లతో గంగమ్మ ఆలయ ప్రాంగణానికి చేరుకొన్నారు. గంగమ్మ మూలవిగ్రహానికి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భోజనాలు వండి గంగమ్మ, సల్లాపురమ్మకు నైవేద్యం సమర్పించారు. వర్షాలు బాగా కురిసి చెరువులు నిండాలని.. పంటలు బాగా పండాలని.. అంటు రోగాలు ప్రబలకుండా కాపాడాలని అమ్మవార్లను మొక్కుకున్నారు. ఆలయ సమీపంలో సామూహిక భోజనాలు చేశారు. సాయంత్రం వరకు కోలాటలు, భజనలు చేసి అనంతరం చెరువులో పూజలు చేసి గ్రామానికి చేరుకొన్నారు.

## భవనంపై నుంచి జారిపడి విద్యార్థినికి తీవ్రగాయాలు



రుయాలో చికిత్స పొందుతున్న భావన

తిరుపతి రూరల్,జూలై14: తిరుపతిలో ఎస్వీ వెటర్నరీ వర్సిటీ కళాశాలలో బీవీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని భావన ఆదివారం ఉదయం హాస్టల్ భవనంపై జారిపడి తీవ్రగాయాలపాలైంది. చిత్తూరుకు చెందిన ఈ విద్యార్థిని ఉదయం టిఫిన్ తిన్నాకా హాస్టల్ భవనంపైకి ఎక్కి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా ప్రమాదవశాత్తూ కాలుజారి కింద పడిందని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. విద్యార్థినిని వెంటనే రుయాకు తరలించారు. వెన్నుముక, కుడిచేయికి బలమైన గాయాలైనట్లు గుర్తించారు. తల్లిదండ్రులు చేరుకుని కుమార్తెను వేలూరు సీఎంసీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాతావరణం ఆహ్లాదకరంగా ఉండడంతో సెల్ఫీ తీసుకునేందుకు భావన హాస్టల్ భవనంపై ఓపెన్‌ఏరియాలోకి వెళ్లిందని సహచర విద్యార్థులు చెబుతున్నారు. సిమెంటు వాటర్ ట్యాంకుపైకి ఎక్కి సెల్ఫీ తీసుకుంటుండగా కాలిజారి కిందపడి ఉండొచ్చంటున్నారు. వర్షాలకు ట్యాంకుపై నాచు పేరుకుపోయి ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు.

# ఆ పాత మధురం.. ఆధునికం అనుసరణీయం

**●కాడెద్దులు కనుమరుగు ●భారమవుతున్న పశుపోషణ ●వ్యవసాయంలో పెరుగుతున్న యాంత్రీకరణ ● రైతుపై పెట్టుబడి భారం**


ఎద్దులతో పొలంలో దుక్కిదున్నుతున్న రైతు (ఫైల్)


వరి కోత యంత్రంతో పంటనూర్పిడి చేస్తున్న దృశ్యం (ఫైల్)

తంబళ్లపల్లె, జూలై 14: వ్యవసాయంలో ఎద్దులతో రైతులకు విడదీయరాని బంధం ఉంది. ఒకప్పుడు రైతుల జీవితంలో కాడెద్దులు ప్రముఖ పాత్ర పోషించేవి. పొలంలో దుక్కి దున్ని.. విత్తు విత్తడం దగ్గర నుంచి పండిన పంటను ఎడ్లబండిలో ఇంటికి చేర్చే వరకు పనులు జరిగిపోయేవి. ముఖ్యంగా వేరుశనగ, వరి సాగులో కాడెద్దులు ప్రముఖ పాత్ర పోషించేవి. గతంలో పల్లెల్లో రెండు, మూడు ఎకరాలు పొలమున్న ఏ రైతు ఇంట్లో చూసినా ఎద్దులు కనపించేవి. అయితే రోజు రోజుకు మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగిపోయింది. ఎద్దులతో ఒక రోజు చేసే పని యంత్రాలతో రెండు, మూడు గంటల్లో జరిగిపోతోంది. దీంతో క్రమేపి పొలంలో కాడెద్దులు కట్టి...నాగలి పట్టే రైతులు కనుమరుగవుతుండగా రాను రాను కాడెద్దుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోంది. యంత్రాలతో వ్యవసాయం ఖర్చుతో కూడుకున్నదే అయినా సమయం ఆదా అవుతుండటంతో రైతులు క్రమక్రమంగా యంత్రాల వైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. దీంతో గతంలో రైతుల ఇళ్ల ముందు కనిపించిన ఎద్దులు, ఎడ్లబండ్ల స్థానంలో ఇపుడు ట్రాక్టర్లు, వ్యవసాయంలో ఉపయోగించే పలు యంత్రాలు కనిపిస్తున్నాయి. దీంతో నేడు రైతన్నకు పెట్టుబడి పెరిగి భారంగా మారుతోంది.

### భారమవుతున్న పశుపోషణ

గతంలో గ్రామాల్లో రెండు, మూడెకరాలు ఉన్న ప్రతి రైతుకు కనీసం ఒక జత కాడెద్దులు ఉండేవి. ఎద్దులు లేని రైతులు..కాడెద్దులు, నాగలి కట్టే మనిషికి పనిని బట్టి రోజుకు సుమారు రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు వరకు ఇచ్చి అద్దెకు తెచ్చుకుని వ్యవసాయం చేసుకునేవారు. దీంతో గతంలో ఎద్దులకు విపరీతమైన డిమాండ్ ఉండేది. రానురాను దుక్కి దున్నడం నుంచి పంట కోత కోసి ఇంటికి చేర్చే వరకు ప్రతి పనీ ట్రాక్టర్‌తో జరిగిపోతుండడంతో ఎద్దులకు చాలా వరకు డిమాండ్ తగ్గింది. ప్రస్తుత పరిస్థితుల్లో కాడెద్దులను పోషించే స్థోమత ఉన్నప్పటికీ వాటికి నీరు పెట్టడం, మేతకు తీసుకెళ్లడం వంటి పనులు భారంగా మారాయి. దీనికి తోడు కాడె ద్దులు మరీ ఖరీదైపోతున్నాయి. రైతులు చెపుతున్న దాని ప్రకారం మార్కెట్లో కాడెద్దుల ధర (ఎద్దులను బట్టి) రూ.50 వేల నుంచి ఒక లక్షకు పైగా పలుకుతోంది. అంత పెట్టుబడి పెట్టి కాడెద్దులను తీసు కొచ్చి వాటిని పోషించడం తలకు మించిన భారమవుతోంది. డిమాం డ్‌ను బట్టి ఎద్దులకు మేతగా ఉపయోగపడే ఎండు గడ్డి డిమాండును బట్టి ఒక లోడు సుమారు రూ.10నుంచి రూ.18 వేల వరకు పలుకు తోంది. ఇక దాణా, పచ్చిగడ్డి, సంరక్షణ ఇలా ప్రతీది రైతుకు భారమవు తోంది. దీంతో రైతులు ఉన్న ఎద్దులను అమ్మేసి యంత్రాల వైపు మొ గ్గుచూపవలసి వస్తోంది.

### వ్యవసాయంలో పెరుగుతున్న యాంత్రీకరణ

మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు వ్యవసాయంలో సాంకేతికతను వినియోగించుకుంటున్నారు. అందుబాటులోకి వచ్చిన ఆధునిక యంత్రాలతో పొలం పనులు త్వరగతిన సాగుతుండటంతో రైతుకు కూలీల ఖర్చుతో పాటు, సమయం ఆదా అయి శ్రమ తగ్గుతోంది. పొలం దున్నడానికి(ఐదు మడకలు, తొమ్మిది మడకలు), సాలు తీయడానికి, దుక్కి చేయడానికి రోటోవేటర్, విత్తులు విత్తడానికి సీడ్ డ్రిల్, కలుపు తీయడానికి వీడర్, పంట కోయడానికి హార్వెస్టర్లు, పంట దిగుబడి నూర్పిడి చేసి బస్తాల్లో నింపి ఇంటికి చేర్చడం ఇలా దాదాపు అన్ని పనులు యంత్రాలతోనే జరిగిపోతున్నాయి. ఉదాహరణకు ఒక ఎకరా పొలంలో వేరుశనగ విత్తనాలు వేయడానికి గతంలో రెండు జతల కాడెద్దులు(విత్తనాలు వేయడానికి, పాపడానికి), నాగలి పట్టడానికి ఇద్దరు వ్యక్తులు, విత్తనాలు భూమిలో వేయడానికి ఇద్దరు కూలీలు అవసరమయ్యేవారు. ఒక ఎకరంలో విత్తనాలు వేసి, పాపడానికి ఇంచుమించు 8 గంటల సమయం పట్టేది. అదే ఇపుడు ట్రాక్టర్ సీడ్ డ్రిల్‌తో అయితే ఒక వ్యక్తి, ఒకటిన్నర గంటలో ఎకర పొలం విత్తనాలు వేసే విధంగా అదునాతన యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి.

### రైతుపై పెట్టుబడి భారం

రోజురోజుకు పెరుగుతున్న పెట్రో, డీజిల్ ధరలతో రైతుల మీద యంత్ర భారం పడుతోంది. యంత్రాలతో సాగు ఖర్చుతో కూడుకున్నదే అయినా పనులు తొందరగా జరగుతుండటం, కూలీలు పెద్దగా అవసరం లేకపోడంతో రైతులు యంత్రాల వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే పంట పెట్టుబడులు పెరగడం, ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక రైతులు నష్టాలు చవిచూడటం పరిపాటిగా మారింది. గతంలో కాడెద్దులు ఉన్న రైతులు ఎకరా పొలంలో వేరుశనగ విత్తనాలు వేయాలంటే కూలీలు, పెట్టుబడి ఖర్చు వచ్చేది. అదే యంత్రాలతో సేద్యం అయితే ట్రాక్టర్‌తో ఎకరా పొలం దున్నడానికి రూ.1500(ఒకటిన్నర గంట), దుక్కి చేయడానికి రూ.1500, విత్తనాలు వేయడానికి రూ.1200 వరకు తీసుకుంటున్నారు. ఇలా విత్తనాలు విత్తడం, కలుపు తీయడం, కోతలు కోయడం, పంట ఇంటికి తరలిచడం వంటి సమయాల్లో గతంలో కంటే ఇప్పుడు రైతుకు యంత్ర భారం పడుతోంది. ఇక రసాయన ఎరువులు, కూలీలు అదనపు ఖర్చు. రైతులు చెప్పేదాని ప్రకారం చూస్తే ఎద్దులతో కాకుండా ఎకరా పొలంలో వేరుశనగ సాగు చేయాలంటే రూ.25 నుంచి రూ.35వేల వరకు పెట్టుబడి వస్తోందని చెపుతున్నారు. గతంలో కంటే పంట దిగుబడి బాగా తగ్గిపోవడం, అతివృష్టి, అనావృష్టిల కారణంగా పంటలు దెబ్బతినడం, పెట్టుబడులు పెరగడం ఇలా పలు కారణాలతో వ్యవసాయం భారమై ఏడాదికేడాది సాగు శాతం తగ్గుతోంది.

### అన్ని పనులు ఎద్దులతోనే జరిగిపోయేవి

గతంలో విత్తనాలు వేయడం దగ్గర నుంచి, పంటను ఇంటికి తీసుకొచ్చే వరకు ఎక్కువ పనులు ఎద్దులతో చేసేవాళ్లం. దాదాపు ప్రతి ఇంట్లో ఎద్దులు ఉండేవి. ఎద్దులతో సేద్యం నిదానమే అయినా తక్కువ ఖర్చుతో పాటు మంచి దిగుబడులు వచ్చేవి. రైతుకు పెట్టుబడి పోనూ లాభాలు చూసేవాళ్లం. రానురాను రైతులు ఎద్దులను వదిలేసి యంత్రాల వైపు మళ్లారు. విత్తనాలు భూమిలో వేయడం నుంచి పంట చేతి కొచ్చేవరకు యంత్రాల పైనే ఆధారపడుతున్నారు. దీంతో సాగులో పెట్టుబడి ఖర్చు పెరిగి ఆశించిన దిగుబడులు రాక నష్టాలు చవిచూడాల్సి వస్తోంది.

**- జాఫర్‌వల్లి, రైతు, తంబళ్లపల్లె**

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


రాజమ్మ (ఫైల్ ఫొటో)

పెద్దతిప్పసముద్రం జూలై 14 : అనుమానాస్పద స్థితిలో రాజమ్మ(48) అనే మహిళ శనివారం రాత్రిమృతి చెందింది. పీటీఎం ఎస్ఐ రవీంద్రబాబు కథనం మేరకు పీటీఎం మండలం మద్దయ్యగారిపల్లె పంచాయతీ బురుజుపల్లెకు చెందిన గంగులప్ప భార్య రాజమ్మ శనివారం గ్రామ శివారులోని పొలాల్లోకి వేపగింజలు ఏరుకునేందుకు వెళ్లిందన్నారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన ఆదెప్ప అనే అతను తమ పొలంలో వేప గింజలు ఎలా ఏరుతావంటూ ఆమెపై దాడికి పాల్పడినట్లు తెలిసిందన్నారు. కాగా ఆదివారం ఉదయం రాజమ్మ మృతి చెందినట్లు సమాచారం రావడంతో పీటీఎం పోలీసులతో కలిసి బురుజుపల్లెకు చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కాగా పోస్టుమార్టం రిపోర్టు వస్తేగాని ఆమె మృతికి గల కారణాలు తెలుస్తాయని ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.

## ఐదుగురు జూదరుల అరెస్టు

మదనపల్లె అర్బన్, జూలై14: జూదమాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ శేఖర్ తెలిపారు. ఆదివారం మదనపల్లె మండలం, కోటావారిపల్లెలో జూదం నిర్వహిస్తునట్లు సమాచారం అందడంతో తాలుకా సీఐ శేఖర్ తాలుకా ఎస్ఐ సిబ్బందిని పంపి ఐదుగురిని అరెస్టు చేసి రూ. 13,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ చెప్పారు.

## ద్విచక్ర వాహనాలు ఢీ.. ఒక్కరికి గాయాలు

పెద్దతిప్పసముద్రం జూలై 14 : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు డీకొన్న ప్రమాదంలో ఓవ్యక్తికి గాయాలైన సంఘటన పీటీఎం మండలం కందుకూరులో చోటుచేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలిలావున్నాయి. కడప జిల్లా వేంపల్లికు చెందిన ప్రసాద్ ద్విచక్ర వాహనంలో చేలూరుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో కందు కూరు మీదుగా వేంపల్లెకు వెళుతుండగా మద్దయ్యగారిపల్లె వైపు నుంచి ఓ ద్విచక్ర వాహనం ద్విచక్రవాహనాన్ని డీకొంది. ఈ ప్రమాదంలో ప్రసాద్‌కు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి అతనిని బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పీటీఎం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పీటీఎం ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.

## వాహనాలకు రికార్డులు లేకపోతే జరిమానా


వాల్మీకిపురంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ నాగేశ్వర్‌రావ్

వాల్మీకిపురం, జూలై 14: వాహనాలకు రికార్డులు సక్రమంగా లేకపోతే జరిమానా తప్పదని వాల్మీకిపురం ఎస్ఐ నాగేశ్వర్‌రావ్ హెచ్చరించారు. ఆదివారం పట్టణంలో వాహనాల తనిఖీలు నిర్వహించి పలు వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు బాధ్యతగా రహదారి నిబంధనలు పాటించాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## రామసముద్రంలో పీర్లపండుగ

రామసముద్రం, జూలై 14: మండల కేంద్రంలోని దిగువపేట, ఎగువపేట, ఆర్.నడింపల్లె గ్రామాల్లో ఏడవ రోజు పీర్ల పండుగ వేడుకలు కుల మతాలకు అతీతంగా గ్రామస్థులు అందరూ కలిసి భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు. ఆదివారం రాత్రి గంధపు పీర్లను పానకంతో నింపిన మట్టిన కుంటలను గ్రామంలో ఊరేగింపు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈవేడుకలు తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా మొహర్రం వేడుకలలో భాగంగా తొమ్మిదవ రోజు వేడుకలు మంగళవారం రాత్రి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పోతబోలులో వేడుకలు

మదనపల్లె అర్బన్, జూలై14: మదనపల్లె మండలం, పోతబోలులో సోమవారం మొహర్రం పండుగ వేడుకలు నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ పఠాన్‌ఖాదర్ ఖాన్ తెలిపారు. ఆదివారం పోతబోలులోని దర్గాలో మొహర్రం పండుగను పురష్కరించుకుని పీర్లు ముస్తాబు చేశారు. నూతన వస్త్రాలతో, పూలతో పీర్లను ప్రత్యేకంగా అలంకరణ నిర్వహించారు. హిందూ, ముస్లీంలు కలిసి నిర్వహించే మొహర్రం పండుగను అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## వైభవంగా గంగమ్మ జాతర ఉత్సవాలు


వాల్మీకిపురం ఇందిరమ్మ కాలనీలో దీలు బోనాలతో వెళ్తున్న మహిళలు

వాల్మీకిపురం, జూలై 14: వాల్మీకిపురం పట్టణంలోని కొత్త ఇందిరమ్మ కాలనీలో ఆదివారం గంగమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. కాలనీలోని నల్లవీరగంగమ్మ దేవాలయంలో ఉదయం అభిషేకం, విశేష అలంకరణలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం మహిళలు అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

## రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు


అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, జూలై 14:మండలంలోని చెర్లోపల్లె సమీపంలో కొలువైన రెడ్డెమ్మ కొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళ భరిత పుష్పాలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

కార్యదర్శుల కొరతతో

## పడకేసిన పారిశుధ్యం


గ్రామాల్లోని రోడ్లపై పారుతున్న మురుగు నీరు

నిమ్మనపల్లి, జూలై 14: మండలంలో పంచాయతీ కార్యదర్శుల కొరతతో పారిశుధ్యం పడకేసింది. పది గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో 5పంచాయతీలకు మాత్రమే కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. నిమ్మనపల్లి, కొండయ్యగారిపల్లి, రాచవేటివారిపల్లి, తవళం, అగ్రహారం పంచాయతిలకు కార్యదర్శులు లేరు. ఈ గ్రామ పంచాయతీలలో వుండే పారిశుధ్య పనులను ఇన్‌చార్జి కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తుండడంతో పాటు ప్రస్తుతం ప్రతి పనినీ ఆన్‌లైన్ చేయనుండంతో పనుల ఆలస్యంమవుతున్నాయి. అంతే కాకుండా నిత్యం ఎక్కడో ఒక చోట సమస్య తలెత్తుతుందని వాటిని పరిష్కరించేందుకు సిబ్బందికి ఇబ్బందులు తప్పడంలేదు. కాగా తవళం, అగ్రహారం పంచాయతిలకు కార్యదర్శులు వున్నా వారు ఇద్దరూ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం వున్న 5మంది కార్యదర్శులకు అదనపు పంచాయతీలను అప్పగించడంతో గ్రామాలలో పారిశుద్య పనులు సకాలంలో చేపట్ట లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయమై ఈవోపీఆర్‌డీ చలపతిరావు మాట్లాడుతూ అన్ని పంచాయతీలకు కార్యదర్శులను నియమిస్తే మంచి ఫలితాలను అందిస్తామని తెలిపారు.

## రైళ్ల నిలుపుదలకు వినతి

పుల్లంపేట, జూలై 14: పుల్లంపేట రైల్వేస్టేషన్‌లో నంద్యాల-రేణిగుంట డెమో రైలు, తిరుపతి-గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలని మండల ప్రజలు ఆదివారం పుల్లంపేట రైల్వే స్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గ్రామస్థులు రైల్వేస్టేషన్‌కు వెళ్లి వినతిపత్రం ఇచ్చారు. పుల్లంపేట రైల్వేస్టేషన్‌లో తిరుపతి హుబ్లీ ప్యాసింజర్ రైలు, అరక్కోణం - కడప ప్యాసింజర్ రైళ్లకు మాత్రమే స్టాపింగ్ ఉందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి చేరుకోవడానికి, గుంటూరు ప్రాంతంలో చదివే విద్యార్థుల కోసం ఈ రైళ్లను పుల్లంపేటలో స్టాపింగ్ ఇవ్వాలని వారు కోరారు.

## పూర్వ విద్యార్థులు ఆత్మీయకలయిక


వెలిగల్లు హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

పెద్దమండ్యం, జూలై 14: మండలంలోని వెలిగల్లు హైస్కూల్ లో ఆదివారం 2003-04 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయంగా కలిశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులు చెప్పిన మాటలను గుర్తు చేసుకొని ఆ రోజుల్లో గురు శిష్యుల బంధాన్ని అభివర్ణించారు. పూర్వ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం ఆప్పటి ఉపాధ్యాయులకు పూర్వవిద్యార్థులు దుశ్శావలతో సన్మానించారు. ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, భాస్కర, కిరణ్ కుమార్, మదన్ మోహన్, మాధవి, విజయలక్ష్మీ, రుక్మిణీ, విద్యార్థులు ప్రవీణ్ కుమార్, శ్రీనివాసులు, రెడ్డిప్రసాద్, అమరనాధరెడ్డి, ఖాదర్‌వలీ, సరళ, రమణమ్మ, ముబారకీ, అనిత, మమత, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

## తిరుమలకు టీడీపీ నేతల పాదయాత్ర


తిరుమలకు పాదయాత్రగా బయలు దేరిన టీడీపీ నాయకులు

నిమ్మనపల్లి, జూలై 14: మండలంలోని అగ్రహారం పంచాయతి చెరువు ముందరపల్లి (నల్లగొండ)కు చెందిన 10 మంది టీడీపీ నాయకులు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టండంతో ఆదివారం మొక్కులు తీర్చుకునేందకు తిరుమలకు పాదయాత్రగా బయలు దేరివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన పోయి రామరాజ్యం రావడం ఎంతో సంతోషించదగ్గ విషయం అని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్ర ప్రజలు తీవ్రఇబ్బందులకు గురిచేయడంతో పాటు అన్ని వర్గాలను నిర్వీర్యం చేశారన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, మదనపల్లిలో టీడీపీ అధికారంలోకి వస్తే తిరుమలకు వచ్చి తలనీలాలు సమర్పించు కొంటామని ఆనాడే నిశ్చయించుకొన్నట్లు తెలిపారు. తాము కోరుకొన్నట్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాలినడన తిరుమలకు బయలు దేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రెడ్డెప్పరెడ్డి, రెడ్డెప్ప, రవీంధ్ర, తేజ, రామచంద్ర, శ్రీనివాసులు, నేత్ర, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఏపూరమ్మకు బోనాలు

సుండుపల్లె,జూలై 14: మండల పరిధిలోని తిమ్మసముద్రం ఏపూరమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఆదివారం ఉదయం తిమ్మసముద్రం, లగిశెట్టిపల్లె గ్రామాల్లో ఇంటింటి నుంచి పోతులరాజు విగ్ర హం ముందు తీసుకెళ్తుండగా మహిళలు, బోనాలు తీసుకుని గ్రామోత్సవంతో ఆలయానికి వచ్చారు. పలకలు, డ్రమ్స్ వాయిస్తూ గ్రామస్తులు ఆట్టహాసంగా అమ్మవారికి బోనాలు తీసుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం బోనాలు ఉంచి పూజలు చేశారు. అనంతరం అమ్మవాంరికి నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి అర్చనలు చేశారు.

**గాలివీడులో:** ఆషాఢ మాసం సందర్భంగా నూలివీడు గ్రామ ప్రజలు గ్రామ దేవత అయిన రేణుక యల్లమ్మ అమ్మవారికి ఆదివారం బోనాలు సమర్పించారు. ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకోవడం ఆనవాయితీ. అమ్మవారికి బోనాలు పడితే సకాలంలో వర్షాలు కురుస్తాయని, పాడి పంటలు సంవృద్ధిగా పండుతాయని ప్రజల నమ్మకం. అమ్మవారికి బోనాల కార్యక్రమంలో బాణాసంచా పేల్చుతూ అంగరంగ వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

### చిన్నమండెంలో వరుణుడి కోసం..

చిన్నమండెం, జూలై 14: మండలంలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీ కుర్వపల్లెలో వరుణుడి కోసం బోనాలు పడతారు. ఈ ఏడాది వర్షాలు బాగా పడతాయని వాతావరణశాఖ హెచ్చరించడంతో ఎంతగానో ఆశలు పెట్టుకున్న అన్నదాతల ఆశలు అడియాశలయ్యాయి. దీంతో అక్కడక్కడ వేసిన వేరుశనగ వర్షాలు లేక ఎండిపోతోంది. దీంతో కుర్వపల్లెలో ప్రతియేటా వర్షం కోసం ఆనవాయితీగా ఉన్న బోనాలను ఆదివారం చేపట్టారు.

## టమోటా మార్కెట్‌లో సమస్యలను పరిష్కరిస్తాం

మదనపల్లె టౌన్, జూలై 14: మదనపల్లె టమోటా మార్కెట్‌లో ఐదేళ్లుగా ఉన్న సమస్యలను ఇరువర్గాలతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే షాజహాన్ బాషా హామీ ఇచ్చారు. ఆదివారం స్థానిక పుంగనూరు రోడ్డులో లారీ అసోసియేషన్ నాయకులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లారీ, మినీ లారీ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ మదనపల్లెలో 500 పైగా లారీలు, 400 పైగా మినీలారీలు ఉన్నాయని, ఇవన్నీ ప్రధానంగా స్థానిక టమోటా మార్కెట్ నుంచి టమోటాలను ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తూ వాటి మీదనే తమ కుటుంబాలు ఆధారపడ్డాయన్నారు. కాని కొంత మంది టమోటా వ్యాపారులు తమ లారీలను అద్దెకు పిలవకుండా బయట ప్రాంతాల నుంచి లారీలను తీసుకొచ్చి టమోటా లోడింగ్ చేయిస్తుండటంతో తమ లారీలకు అద్దెలు లేక అప్పులు పాలవుతున్నామన్నారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో ఒక సమావేశం ఏర్పాటు చేసి ఇరువర్గాలకు సముచితంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం స్థానిక అనపగుట్ట ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే అక్కడ ప్రజలు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతుండటంపై స్పందించారు. మున్సిపల్ అధికారులతో చర్చించి అనపగుట్ట ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తా



ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సన్మానిస్తున్న పాత్రికేయులు

మదనపల్లె టౌన్, జూలై 14: మదనపల్లె నియోజకవర్గంలో పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను పాత్రికేయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లుగా మదనపల్లె ఎమ్మెల్యేలుగా పనిచేసిన ఇద్దరు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించకపోవడం బాధకరమన్నారు. వైసీపీ పాలనతో జీవోలు వచ్చాయే కాని అవి అమలు కాలేదన్నారు. త్వరలో మదనపల్లెలోని జర్నలిస్టులకు రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు వారికి సిమెంట్, ఇసుక సరఫరాలో ఆర్థికంగా ఆదుకుంటానన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమేశ్‌బాబు, కార్యదర్శి నక్కా చంద్ర, కోశాధికారి కిరణ్‌కుమార్, శ్రీనివాసులు గౌడ, జె.శ్రీనివాసులు, ఆర్. గోపి, శివారెడ్డి, వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

## సిమెంటు డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా


ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న పీలేరు సిమెంటు డీలర్లు

పీలేరు, జూలై 14: సిమెంటు డీలర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పీలేరు పట్టణంలోని సిమెంటు డీలర్ల అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు తాము సిమెంటు రంగంలో వస్తున్న మార్పులు, వాటి వల్ల తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు తెలియజేశారు. ఆ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి వారికి తెలిపారు. నగరిపల్లెలో జరిగిన ఈ కార్యక్రమంలో డీలర్లు వాసవీ రవి, ఎస్‌కేఆర్ అఫ్సర్, మోహన్ రెడ్డి, ధర్మయ్య, పురుషోత్తం రెడ్డి, యోగానంద, శ్రీకాంత్, ఖాదర్, సయ్యద్, రాజన్న, చంద్రస్వామి, ఇనాయతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ కమ్యూనిటీ హాల్‌కు స్థలమివ్వండి

మదనపల్లె అర్బన్, జూలై14: మదనపల్లెలో సీనియర్ సిటిజన్స్‌కు కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలని ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఆదివారం స్థానిక జీఆర్టీ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు సీనియర్ సిటిజన్స్ తమ సమస్యలను విన్నవించారు. అనంతరం సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కు కమ్యూనిటీ హాల్‌కు స్థలం కుటాయించాలని, మదనపల్లెను జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీరామరామాంజనేయులు, దారం అనిత, హరిప్రసాద్, రాజంపేట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల కృష్ణమూర్తి, స్టేట్ అధ్యక్షుడు అంజనేయకుమార్, ప్రొఫెసర్ శ్రీనివాసులు, గొల్లపూడి తిరుపతిరావు,ధన లక్ష్మీ. పూర్ణిమ, వసంత, తదితరులు పాల్గొన్నారు.

## గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి


ఉచిత వైద్య శిబిరంలో మహిళలను పరీక్షిస్తున్న వైద్యులు

పీలేరు, జూలై 14: ఇటీవలి కాలంలో ఎక్కువగా వెలుగు చూస్తున్న గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని కేవీపల్లెలోని శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్టు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శశికుమార్ రెడ్డి మహిళలకు విజ్ఞప్తి చేశారు. 'సంజీవని' పేరిట అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్టు కేవీపల్లె మండలంలో ఉచిత వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం నూతనకాల్వ గ్రామంలో శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహన లేకపోవడం వల్ల గర్భాశయ క్యాన్సర్ నిశ్శబ్ద హంతకుడిలా మారి గ్రామీణ ప్రాంత మహిళల ప్రాణాలను కబళిస్తోందన్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే దానికి సులువుగా వైద్యం పొందవచ్చన్నారు. అందు కోసం తాము కేవీపల్లె, కలికిరి, కలకడ మండలాల్లో పెద్దఎత్తున అవగాహన సదస్సులు, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నూతనకాల్వలో జరిగిన శిబిరంలో 125 మంది మహిళలను పరీక్షించి 23 మందికి పాప్ స్మియర్ టెస్టులు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు డాక్టర్ బ్రహ్మారెడ్డి, గైనకాలజిస్టులు నిరోషా, విద్య, ప్రీతి, వైద్యులు జిలాని, షమీమ్, ప్రోగ్రాం వలంటీర్లు శ్రీనివాస్ రెడ్డి, ఆదినారాయణ, రామాంజనేయులు, షబ్బీర్ పాల్గొన్నారు.

## మహిళకు ఆర్థిక సాయం


దుకాణం ప్రారంభిస్తున్న మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

మదనపల్లె అర్బన్, జూలై14:చిల్లర అంగడి నడుపుటకు మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఏఆర్ సురేష్ ఓ మహిళకు రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం ఈ సందర్భంగా వన్‌టౌన్ ఎస్ఐహరిహరప్రసాద్ మాట్లాడు తూ మన చుట్టూ ఉన్న వారికి సాయం చేయడం గొప్ప గుణమని సురేష్‌ను అభినందించారు. చిన్నారి కరాటే విద్యార్థుల చేతులమీదుగా చిల్లర దుకాణాన్ని ఎస్ఐ ప్రారంభించారు. ఈశ్వరమ్మ అనే మహిళకు జీవనోపాధి కల్పించిన సురేష్‌ను పట్టణంలో ప్రముఖులు ప్రశంసించారు. కార్యక్రమంలో యూత్‌కరాటే కార్యదర్శి మణి సాయి, ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్, బ్లాక్ బెల్ట్ ముజీబ్, కరాటే ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## పీలేరులో రైతు బజారు ఏర్పాటు చేయాలి

పీలేరు, జూలై 14: పీలేరులో రైతు బజారు ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యుడు, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీలేరులో ఆదివారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అర్హతలు ఉన్న పీలేరులో ఇంత వరకు రైతు బజారు లేకపోవడం అటు రైతులు, వ్యాపారులు, ఇటు సామాన్య ప్రజలకు నష్టదాయకమన్నారు. రైతులకు నాణ్యమైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి వారికి మంచి ధరలు లభించేలా చూడడంలో రైతు బజార్‌లు ఉపయోగపడతాయన్నారు. పీలేరు పట్టణంలో దానిని ఏర్పాటు చేసేందుకు స్థానిక వెలుగు కార్యాలయం వద్ద స్థల సేకరణ జరిపినప్పటికీ నిర్మాణానికి గత ప్రభుత్వం చొరవ చూపలేదన్నారు. ఇప్పటికైనా దానిని నిర్మిస్తే పీలేరు ప్రాంత రైతులు, ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రైతు బజార్ లేకపోవడం వల్ల ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన రాయితీ సన్న బియ్యం, కంది పప్పును పీలేరు ప్రజలు అందుకోలేకపోయారని ఆయన వాపోయారు.

## ఉచిత పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె టౌన్, జూలై 14: గ్రామాల్లో యువత ముందుకు వచ్చి నిర్వహిస్తున్న ఉచిత పశువైద్యశిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మండలంలోని చిప్పిలి గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశుపోషణ వారోత్సవాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవులు ఎలా ఆరోగ్యాన్ని కాపాడుకుంటారో అలాగే పశువులు, మూగజీవాలను కూడా నెలకు ఒకసారి ఆరోగ్యపరీక్షలు చేయించాలన్నారు. పశువులకు పిడుదుల పడకుండా బూటాక్స్ మందును ఎమ్మెల్యే పిచికారి చేశారు. అనంతరం అవసరమైన పశువులను వాక్సినేషన్, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ ప్రసాదరెడ్డి, టీడీపీ నాయకులు బీద గురునాథ్, వెలుగు వెంకటేశ్, జేసీబీ మధుసూదన్‌రెడ్డి, నయాజ్, ఖాదర్‌బాషా, చంద్రశేఖర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.